

సోమశిలలో 48.605 టీఎంసీల నీరు

అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురువారం 14,714 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ 77.988 టీఎంసీలు కాగా 48.605 టీఎంసీలకు చేరుకుంది. దిగువ డెల్టాకు 550, కండ లేరుకు 10,000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● ఆశావహులపై విజయవాడ ముంపు ప్రభావం ● సహాయక చర్యల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బిజీ బిజీ ● అక్కడ పరిస్థితులు చక్కబడ్డాకే పదవులు



'నామినేటెడ్' భర్తీ.. దసరా తర్వాతే!

విజయవాడ ముంపు.. కూటమి నేతల ఆశలపై నీళ్లు చల్లింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నామినేటెడ్ పోస్టుల భర్తీ ఈ నెలలో లేదనే సంకేతాలు వెలువడ్డాయి. బెజవాడలో పరిస్థితులు చక్కబడ్డాకే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇతర విషయాలు ఆలోచించే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో నామినే టెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్న ఆశవహులు దసరా వరకు వేచి చూడక తప్పదని తెలుస్తోంది.

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), సెప్టెంబరు 12 : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కూటమి పార్టీలను కాపాడుకోవడానికి, ఎన్నికల్లో మన విజయానికి కృషి చేసిన పలువురు నాయకులు నామినేటెడ్ పోస్టుల మీద ఆశలు పెట్టుకున్నారు. సీఎం చంద్రబాబు సైతం 2014-19 కాలానికి భిన్నంగా నామినేటెడ్ పదవులను వెంటనే భర్తీ చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఆ పోస్టులకు అర్హులైన నాయకుల పేర్లను పరిశీలించారు. వడపోత కార్యక్రమం దాదాపు పూర్తయిన దశలో మరో 20 రోజుల్లో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తానని చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. ఈ క్రమంలో కూటమి నేతల్లో ఉత్కంఠ మొదలయ్యింది. సరిగ్గా ఈ సమయంలోనే అనుకోని ఉప్పెన విజయవాడను ముంచెత్తింది. సీఎం చంద్రబాబు రేయింబవళ్లు విజయవాడలోనే తిష్టవేసి సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. రాష్ట్ర యంత్రాంగాన్ని, పార్టీ శ్రేణులను పూర్తిగా వరద బాధితుల సహాయక చర్యలకు వినియోగించారు. ముంపు ప్రభావం తగ్గుముఖం పట్టినా విజయవాడ కోలుకోవాలంటే చాలా కాలం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి. అప్పటి వరకు చంద్రబాబు మరో పనిపై దృష్టి సారించే అవకాశం లేదు. ఈ క్రమంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ అనివార్యంగా వాయిదా పడింది. విజయవాడ అన్నివిధాలా కోలుకుంటే విజయదశమికి నామినేటెడ్ పదవుల విషయం చంద్రబాబు పరిశీలించే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం. అంతవరకు ఆశావహులు ఎదురు చూడాల్సిందే.

ఉద్యోగుల బదిలీల గడువు

22 వరకు పొడిగింపు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 12 : ఉద్యోగుల బదిలీల గడువును ఈ నెల 22వ తేదీ వరకు కూటమి ప్రభుత్వం పొడిగించింది. వాస్తవానికి గత నెల 31వ తేదీ నాటికే స్థానచలనాలు ముగించాల్సి ఉంది. అయితే, ఆ సమయానికి బదిలీ ప్రక్రియ పూర్తి కాకపోవటంతో ఈ నెల 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. ప్రస్తుతం విజయవాడలో వరదల కారణంగా బదిలీల ప్రక్రియను మళ్లీ ప్రభుత్వం పొడిగించింది.

జిల్లాకు జ్వరమొచ్చింది. ఎక్కడ చూసినా వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. వర్షాలు కురవడం, దోమల ఉత్పత్తి పెరగడం, నీటి నిల్వలు, పారిశుధ్యలేమి తదితర కారణాలతో జ్వరాలు ప్రబలుతున్నాయి. జ్వర పీడితులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు నిండుతున్నాయి. ఇవికాక అనుమానిత చికున్‌గున్యా కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి.

జ్వరం.. జ్వరం..

ఎక్కడ చూసినా వైరల్ ఫీవర్లే

● 15వేల మందికిపైగా బాధితులు
● చికున్‌గున్యా అనుమానిత కేసులు



నెల్లూరు : జీజీహెచ్ ఓపీ విభాగంలో రోగులు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 12 : జిల్లాలో ఇటీవల వర్షాలు కురవడంతో కొత్తనీటి రాక, నీటి వనరుల కలుషితం వల్ల వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే వ్యాధిగ్రస్తుల్లో జ్వరాల కేసులే 40 శాతం ఉంటున్నాయంటే ఏ స్థాయిలో జ్వరాలు ప్రబలుతున్నాయో అర్థమ వుతుంది. పల్లెల్లోనూ పెద్ద సంఖ్యలో జ్వరపీడితులు ఉంటున్నారు. గ్రామీణ వైద్యులను ప్రతిరోజూ పదుల సంఖ్యలో బాధితులు కలిసి చికిత్స చేయించుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 52 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా వాటిలో గత వారం రోజులలో 350 మందికి పైగా జ్వరాల కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ఏరియా, జిల్లా ఆసుపత్రులతోపాటు నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోజుకు 2వేలకు మందికిపైగా వివిధ రకాల రోగులు వస్తున్నారు. వీరిలో జ్వరపీడితులే ఎక్కువగా ఉంటున్నారు. ఇక, జిల్లాలో 2వేలకు పైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఉండగా వాటికి వచ్చే జ్వరాల బాధితుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 15వేలకు మందికి పైగా వైరల్ జ్వరపీడితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇవికాక టైఫాయిడ్, మలేరియా వంటి కేసులు కూడా ఎక్కువగానే నమోదవుతున్నాయి.

● డెంగ్యూ జ్వరాలూ ఎక్కువే!

జిల్లా వ్యాప్తంగా డెంగ్యూ విషజ్వరాలు కలవర పెడుతున్నాయి. ఇప్పటి వరకు 75 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని వైద్య ఆరోగ్యశాఖ చెబుతుండగా ప్రైవేట్ ఆసుపత్రుల్లోనే 300కు పైగా కేసులు

నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి



విష జ్వరాల బాధితులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తుండటం, జ్వరాలకు ఇదే సీజన్ కావటంతో జ్వరపీడితులు ఆసుపత్రులకు ఎక్కువగా వస్తున్నారు. టైఫాయిడ్ కేసులు నమోదవుతున్నాయి. డెంగ్యూ బాధితులు పలు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. తప్పనిసరిగా కరోనా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి పరీక్షలు, చికిత్స ద్వారా జ్వరపీడితులు పూర్తిగా కోలుకుంటారు.

- డాక్టర్ కృష్ణమూర్తి, జీజీహెచ్, అసోసియేట్ ప్రొఫెసర్

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నమోదైన జ్వరాల కేసులు

జ్వర రకం	ప్రభుత్వం	ప్రైవేట్
వైరల్ ఫీవర్	4,000	15,000
డెంగ్యూ ఫీవర్	75	568
అనుమానిత చికున్‌గున్యా	-	90
టైఫాయిడ్	2000	4300
మలేరియా	4	80



వైద్య పరీక్షల కోసం వేచిఉన్న రోగులు

ఉన్నట్లు అక్కడి వైద్యులు చెబుతున్నారు. నెల్లూరులోని ఒక్క ప్రైవేట్ ఆసుపత్రిలోనే 52 మంది డెంగ్యూ జ్వరంతో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ప్రస్తుత తరుణంలో జ్వరాలతోపాటు గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులు, దగ్గు జలుబు కేసులు కూడా ఎక్కువగా ఉన్నాయి.

● సర్వే లేదు.. ప్రచారం కరువు

జ్వరాల నియంత్రణకు గతంలో వైద్య ఆరోగ్యశాఖ ఫీవర్ సర్వే చేపట్టేది. ఇంటింటికి తిరిగి వైరల్ ఫీవర్ కేసులు, చికిత్స వంటి వివరాలను ఆరోగ్య కార్యకర్తలు నివేదిక రూపొందించే వారు. విషజ్వరాలు ఎక్కువగా నమోదైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. కానీ, ఇప్పుడు ఆ సర్వే జరగటం లేదు. అలాగే, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంలోనూ యంత్రాంగం వైఫల్యం చెందుతోంది. వ్యాధులపై అవగాహన కల్పించే అధికారులు, సిబ్బంది ఉన్నప్పటికీ ప్రజలను అప్రమత్తం చేయడంలో తగిన కసరత్తు, ప్రచారం కరువవుతున్నాయి. వర్షాలు కురుస్తున్నప్పుడు ముందస్తు హెచ్చరికలు చేయాల్సిన వైద్యశాఖ ఆ దిశగా కృషి చేయడంలేదన్న విమర్శలున్నాయి. దీనిపై అధికారులు దృష్టిసారించాలి.

ఈ జాగ్రత్తలు తీసుకోండి...

జ్వరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. లార్వా దశలోనే దోమల నివారణకు మందులు వాడాలి. లార్వా ఉన్న నీటిలో వంద మి.లీ. కిరోసిన్‌ను పోస్తే వెంటనే అవి మరణిస్తాయి. నివాసాల్లో దోమతెరలు, దోమల నివారణ మందులు వాడుకోవడం మంచిది. పరిసరాల పరిశుభ్రత పాటించాలి. చిన్నపాటి జ్వరం వచ్చినా వెంటనే వైద్యుని సంప్రదించాలి. దగ్గు, జలుబుతో బాధపడే వారు మాస్కులు, చేతిరుమాలు ఉపయోగించాలి.

● కాసులిస్తే ఎనీవేర్ అక్రమ రిజిస్ట్రేషన్లు
● కోర్టులో ఉన్నా, నిషేధిత ఆస్తి అయినా కూడా..
● వివాదాస్పద స్థలానికి తాజాగా రిజిస్ట్రేషన్
● రూ.1.50 కోట్ల ఒప్పందం

పైసలిస్తే పచ్చజెండా!

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 12: ముడుపులు ఇస్తేచాలు ఎనీవేర్ అక్రమ రిజిస్ట్రేషన్లకు జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ సిద్ధంగా ఉంది. దూరప్రాంతాల్లో ఉన్నవారు స్వస్థలాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోతే, అలాంటి వారి కోసం ప్రభుత్వం ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌ను ప్రవేశపెట్టింది. ఈ విధానం రిజిస్ట్రేషన్ శాఖలోని లంచావతారులకు వరంగా మారింది. ఈ పద్ధతిని వినియోగించుకుని, కాసులు ఇస్తే చాలు... ప్రభుత్వ భూమైనా, కోర్టు వ్యవహారంలో ఉన్న భూమి నైనా రిజిస్ట్రేషన్ చేసే పరిస్థితి ఇక్కడుంది.

● ఆ పోస్టుకు డిమాండ్

కొంతకాలం కిందట నెల్లూరులో ఓ విలువైన భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వెలుగులోకి వచ్చింది. రూ. కోట్ల విలువ చేసే ఆభూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని, ఆ భూమి సొంత దారు గుర్తించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారు. ఈ క్రమంలో ఆనాటి సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్ చేశారు. ఆ తరువాత పైరవీలు సాగించి స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ పోస్టు కోసం ఎందోమంది ప్రయత్నించారు. వేరే చోట పనిచేస్తూ ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జిగా పనిచేసేందుకు కొందరు వచ్చారు.

● ప్రక్షాళన ప్రారంభం

ఎన్డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టాక రిజిస్ట్రేషన్ శాఖలో ప్రక్షాళన ప్రారంభమైంది. దీంతో స్టోన్‌హౌస్‌పేటలో పనిచేస్తున్న ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఉన్నం శ్రీనివాసులును యథాస్థానమైన వెంకటగిరికి పంపించారు. ఆయన వెళ్లిన తరువాత రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ సహాయకుడు మిల్కిరోషన్‌ను ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు. అలాగే ముత్తుకూరుకు మురళీకృష్ణను ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు. ఎక్కడో పనిచేస్తున్న వారు, రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరిగే కార్యాలయాల్లో పదవుల కోసం పైరవీలు సాగిస్తూ, ఉన్నతాధికారుల మెప్పుపొందుతూ నియామకాలు పొందుతున్నారు. విషయం బయటకు పొక్కితే రిజిస్ట్రేషన్లు రద్దు చేసేసి చేతులు దులుపుకుంటున్నారు.అయితే సబ్ రిజిస్ట్రార్లకు ఎలాంటి శిక్షలూ ఉండటం లేదు.

● తాజాగా కోర్టులో ఉన్న భూమికి రిజిస్ట్రేషన్

తాజాగా ఈ నెల 10న కోర్టులో ఉన్న భూమికి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ రిజిస్ట్రేషన్‌ను రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2 రిజిస్ట్రేషన్ చేశారు. 29604-24 డాక్యుమెంటు నంబరుతో ఈ రిజిస్ట్రేషన్ జరిగింది. కోర్టులో ఉన్న ఈ భూమికి రిజిస్ట్రేషన్ చేయకూడదని తెలిసినా చేసేశారు. 2.39 సెంట్లు ఉన్న భూమిలో 1.22 సెంట్ల భూమిని జీపీఏ(జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) రిజిస్ట్రేషన్‌ను సబ్‌రిజిస్ట్రార్ జాఫర్ చేశారు. అయితే ఇక్కడ ఓ మతలబు ఉంది. ఈ రిజిస్ట్రేషన్‌కు ఎనీవేర్ పద్ధతిని వినియోగించారు. స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోకి వచ్చే ఈ భూమిని నెల్లూరు రిజిస్ట్రార్ కార్యాలయంలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఎనీవేర్ పద్ధతిలో రిజిస్టర్ చేశారు. ఇందుకు స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ మిల్కిరోషన్ ఆమోదం తెలిపారని తెలిసింది. ఆర్‌వో సబ్‌రిజిస్ట్రార్ జాఫర్ జీపీఏ రిజిస్ట్రేషన్‌ను ఈనెల 10న చేసేశారు. పంచాగ్నుల రాధాకృష్ణమూరి అనే వ్యక్తి ఆంధ్ర ఫకీర్‌రావు అనే వ్యక్తికి జీపీఏ రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ భూమి విలువ బయట మార్కెట్‌లో రూ.10 కోట్లకు పైగా ఉంటుందని సమాచారం. దీని జీపీఏ రిజిస్ట్రేషన్‌కు రూ. 1.50 కోట్లు లంచం సమర్పించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారుల హస్తం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ జీపీఏ రిజిస్ట్రేషన్ విషయం గుంటూరు పద్మావతి అనే మహిళ అదేరోజు తెలుసుకుని ఆభూమి తనదని, అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని రిజిస్ట్రేషన్‌శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ శాఖ కమిషనర్ సంబంధిత డీఐజీని విచారించాలని ఆదేశించారు. దీంతో డీఐజీ జిల్లా రిజిస్ట్రార్‌ను విచారణకు పంపినట్లు తెలిసింది. గురువారం జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణచేపట్టినట్లు తెలిసింది.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

రిజిస్ట్రార్ ఆమోదంతోనే చేశా..

సబ్‌రిజిస్ట్రార్ జాఫర్ మాట్లాడుతూ తాను, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ మిల్కిరోషన్ ఆమోదం(అప్రూవల్) తెలుపడంతో ఎనీవేర్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేశానని చెప్పారు. అయితే డాక్యుమెంటును ఈ-ఫైల్ చేస్తున్న సందర్భంలో పద్మావతి అనే మహిళ తన వద్దకు వచ్చి జీపీఏ రిజిస్ట్రేషన్ జరిగిన భూమి తనదని చెప్పటంతో ఆమె చేత ఒక అర్జీ రాయించుకున్నానని చెప్పారు

- ఆర్‌వో సబ్ రిజిస్ట్రార్ జాఫర్

డాక్యుమెంటు రద్దు చేయించాం



గుంటూరు పద్మావతి, పీపీవీ ఎస్ఎస్ నారాయణ అనే వారు 29604-24 డాక్యుమెంటు జీపీఏ రిజిస్ట్రేషన్ విషయమై డీఐజీ కిరణ్‌కుమార్‌కు, తనకు ఫిర్యాదు చేయటంతో ఆ డాక్యుమెంటు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయించాం. ఈ విషయమై స్టోన్‌హౌస్‌పేట కార్యాలయంలోనూ, ఆర్‌వో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ విచారణ జరిపాం. నివేదికను డీఐజీకి అందచేస్తాం.

- బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ముగ్గురిపై వేటు ?

నెల్లూరు రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ముగ్గురిని గురువారం రాత్రి రిజిస్ట్రేషన్‌శాఖ ఐజీ ఆదేశాలతో ఆ శాఖ జిల్లా అధికారులు సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ విషయమై జిల్లా అధికారులకు ఫోన్ చేయగా చేయగా వారు స్పందించలేదు.

పాడిరైతులకు అందుబాటులో ఉంటూ

మెరుగైన సేవలందించాలి

● పశువైద్యులకు కొత్త జేడీ రమేష్‌నాయక్ సూచన



నెల్లూరు(వ్యవసాయం) : గ్రామాల్లోని పశువైద్యశాలల్లో వైద్యులు పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పశువులకు మెరుగైన వైద్య సేవలందించాలని పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌నాయక్ ఆదేశించారు. జిల్లా జేడీగా ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యసేవల్లో అలసత్వం, జాప్యానికి చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరి సహకారంతో ప్రభుత్వ పథకాలు ప్రతి పాడిరైతుకు అందేందుకు కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యంగా ప్రతి పశువుకు బీమా చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులు గోకులాల కోసం దరఖాస్తు చేసుకోవాల ని కోరారు. వ్యాక్సినేషన్, కృత్రిమ గర్భధారణ వంటి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు. కాగా, గతంలో జేడీగా పనిచేస్తున్న డాక్టర్ మహేశ్వరుడు ఉద్యోగవిరమణ పొందడం తో వెటర్నరీ పాలిటెక్నిక్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరరావు ఇన్‌చార్జి జేడీగా వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో కావలి డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ రమేష్‌నాయక్‌కు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించి జిల్లా జేడీగా నియమించింది.



మాట్లాడుతున్న డాక్టర్ పెంచలయ్య

సమయపాలన పాటించకుంటే జీతాలు నిలిపేస్తాం

● డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 12 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకపోతే జీతభత్యాలు నిలిపివేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య హెచ్చరించా రు. గురువారం ఆయన చాంబర్‌లో వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యాలయ వేళలను కచ్చితంగా పాటించాలని, ముఖ ఆధారిత హాజరు వేయాలని ఆదేశించారు. ముఖ హాజరు వేయని వారు, సమయపాలన పాటించని వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో వైద్య పథకాలపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డెమో కనకరత్నం, మంజుల, రమేష్‌బాబు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాక

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 12 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి శనివారం నెల్లూరుకు వస్తున్నారని ఐసీడీఎస్ పీడీ హేన సుజన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె నెల్లూరు జైలును సందర్శిస్తారని, అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్య ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. స్థానిక మహిళలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.



వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ విజయకృష్ణ

కన్నకొడుకే కడతేర్చాడు!

కుటుంబ కలహాలతో ఘాతుకం

పోలీసుల అదుపులో నిందితుడు

సైదాపురం, సెప్టెంబరు 12 : కుటుంబ కలహాలతో కన్నతండ్రినే కడతేర్చాడో సుపుత్రుడు. నిద్రిపోతున్న తండ్రిపై బండరాయితో మోది హత్య చేశాడు. సైదాపురం పంచాయతీ మొలకలపూండ్ల గ్రామంలో గురువారం జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు... సైదాపురం పంచాయతీ పరిధిలోని మొలకలపూండ్ల గ్రామానికి చెందిన పాలేపు వెంకటేశ్వర్లు (55) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మనస్పర్థల నేపథ్యంలో చాన్నాళ్ల క్రితం భార్య బుజ్జమ్మ, కుమారుడు శివాజీతో విడిపోయి తమ్ముడు శ్రీనివాసులు వద్దనే ఉంటున్నాడు. అయితే, తమను పట్టించుకోవడం లేదంటూ తండ్రిపై శివాజీ ఆగ్రహం పెంచుకున్నాడు. ఈ విషయమై తరచూ వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. అయితే, ఏం జరిగిందో ఏమోగానీ గురువారం తెల్లవారుజాము 4 గంటల ప్రాంతంలో ఇంటి ముందు నిద్రపోతున్న తండ్రి ముఖంపై కొడుకు శివాజీ బండరాయితో విచక్షణా రహితంగా కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తర్వాత తన తండ్రిని తానే చంపేశానని కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. వెంటనే వారు ఘటనాస్థలికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న రాపూరు సీఐ విజయకృష్ణ, ఎస్ఐ క్రాంతికుమార్, క్లూస్ టీం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మృతుడి తమ్ముడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గూడూరు ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించినట్లు చెప్పారు.

విధుల్లేకుండా వేతనాలు !

ఏదైనా పనిచేస్తే గానీ పూట గడవని రోజులివి. కానీ, ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాలల్లో మాత్రం పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. గిరిజన సంక్షేమశాఖ హాస్టళ్లలో పనిచేసిన వార్డెన్లు పనిలేకుండానే జీతాలు పొందుతున్నారు. అదికూడా రూ.10... రూ. 100కాదు. రూ.లక్షల్లోనే వేతనాలు తీసుకుంటున్నారు. రెండేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. పని కల్పించమని కోరుతున్నా అధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

- ఖాళీగా గిరిజన హాస్టళ్ల వార్డెన్లు
- గురుకులాలుగా మారటంతో పనికోల్పోయిన పర్యవేక్షకులు
- రూ.లక్షల్లో వేతనాలు.. రెండేళ్లుగా ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు



నెల్లూరులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులు

నెల్లూరు (హరనాథపురం); సెప్టెంబరు 12 : గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని హాస్టళ్లను ప్రభుత్వం 2016లో గిరిజన గురుకుల పాఠశాలలుగా మార్పు చేసింది. ఈ క్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 2016కు ముందు గిరిజన సంక్షేమ హాస్టళ్లు 23 ఉండగా వాటిలో రెండింటిని ఒకటిగా విలీనం చేసి 13 గురుకులాలను ఏర్పాటు చేసింది. ఆ పాఠశాలలకు ప్రిన్సిపాళ్లను నియమించింది. వసతి గృహ నిర్వహణ బాధ్యతలను మాత్రం అప్పటి వరకు హాస్టళ్లలో పనిచేస్తుండిన వార్డెన్లకు అప్పగించింది. దీంతో వార్డెన్లే గురు కులాల్లో విద్యార్థుల బాగోగులు చూసుకునేవారు. అయితే, గురుకుల ప్రిన్సిపాళ్లే వాటిలోని హాస్టళ్లను పర్యవేక్షించా లని, వారే వసతి గృహాలను నడపాలని 2022 జూన్ నెలలో మౌఖిక ఆదేశాలిచ్చింది. అప్పటి నుంచి ప్రిన్సిపాళ్లే గురుకులాల్లోని హాస్టళ్లను పర్యవేక్షిస్తున్నారు. వార్డెన్లు చూస్తుండిన డైట్ క్లోజింగ్ బ్యాలెన్సును జిల్లా గిరిజన సంక్షేమ శాఖా. దికారికి అప్పగించారు. దీంతో వార్డెన్లు పని కోల్పోయారు. నాటి నుంచి విధులు నిర్వహించకుండానే జీతాలు పొందే పరిస్థితి ఏర్పడింది.

గురుకులాలకు వార్డెన్లు వెళుతున్నారు



గిరిజన గురుకుల పాఠశాలలకు వార్డెన్లు వెళుతున్నారు. పాఠశాలల పర్యవేక్షణ చూస్తున్న ప్రిన్సిపాళ్ల వారికి పని కల్పిస్తారు. డిప్యూటీ వార్డెన్లను నియమించుకునే అధికారం ప్రిన్సిపాళ్లకు ఉంది.

- పరిమళ, ఐడీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్

ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో డిప్యూటీ వార్డెన్లు

గిరిజన గురుకులాల ప్రిన్సిపాళ్లు అక్కడ పనిచేస్తున్న వారిలో తమకు నచ్చిన వారిని డిప్యూటీ వార్డెన్లుగా నియమించుకున్నట్లు తెలిసింది. ముందునుంచి ఉన్న వార్డెన్లకు మాత్రం పని కల్పించడం లేదని సమాచారం. దీంతో విధులు అప్పగించాలంటూ వార్డెన్లు గిరిజన సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సర్వీసు రూల్స్‌కు విఘాతం కలుగకుండా గిరిజన సంక్షేమ శాఖ కార్యా లయాల్లో తమకు పని కల్పించాలని కోరుతున్నారు. అయినా అధికారుల నుంచి స్పందన కరువవుతోంది. ఈ విషయంలో ఉన్నతాధికారులైనా చొరవ చూపుతారేమో చూడాలి!.

జీవో నెం.115ను రద్దు చేయాల్సిందే

- జీజీహెచ్ ఎదుట స్టాఫ్‌నర్సుల ఆందోళన



నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 12 : రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు 115ను వెం టనే రద్దు చేయాలం టూ గురువారం నెల్లూరులో స్టాఫ్ నర్సులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏపీఎస్ఆర్ మెడికల్ నర్సింగ్ కాంట్రాక్టు యూనియన్ అధ్యక్షకార్య దర్శులు వేణు, రూతుగ్రేస్ మాట్లాడుతూ నర్సింగ్ కోర్సు చేసిన వారికి 18 నెలల శిక్షణ ఇచ్చి రిజిస్టర్డ్ నర్సులుగా మిడ్‌వైఫరీలుగా గుర్తిచేందుకు ప్రభుత్వం ఆ జీవో జారీ చేసిందన్నారు. దీని ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులలో స్టాఫ్‌నర్సులను నియమిస్తుందని చెప్పారు. అయితే ఇప్పటికే 15 ఏళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రులలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న స్టాఫ్‌నర్సు లను రెగ్యులర్ చేయకుండా ఏఎన్ఎంలకు అవకాశం ఇవ్వటం అన్యాయమన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు శరత్ బాబు, మేరిమాధురి, రీనాకుమారి పాల్గొన్నారు.



ముంబయి జాతీయ రహదారిపై బారులుతీరిన లారీలు

సిమెంట్ ట్యాంకర్ బోల్తా

- జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

సంగం, సెప్టెంబరు 12: మండలపరిధిలోని పెరమన క్రాస్ రోడ్డు వద్ద ముంబయి జాతీయ రహదారి పక్కన డ్రైనేజి కాలువలో రెండు రోజుల క్రితం బోల్తాపడిన సిమెంట్ ట్యాంకర్‌ను గురువారం వెలికితీసే క్రమంలో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. భారీ క్రేన్‌ను తీసుకువచ్చి అతికష్టం మీద బయటకు తీశారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలు ఇరువైపులా బారులు తీరాయి. దీంతో గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది.

నన్ను చంపేందుకు కుట్ర

- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



పోలీసు వాహనాన్ని అడ్డుకుంటున్న యువకుల కుటుంబ సభ్యులు, బంధువులు



శరీరంపై ఉన్న దెబ్బలను చూపుతున్న యువకులు

వెంకటాచలం, సెప్టెంబరు 12: కుట్రపన్ని తనను చంపేందుకు ప్రయత్నిస్తున్నారంటూ మండలంలోని మొలకలపూడికి చెందిన వేణు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన భార్య రచన, ముత్తుకూరుకి చెందిన హరీష్‌తోపాటు మరో ఐదుగురు యువకులు తనపై దాడి చేసి తీవ్రంగా కొట్టారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ కేసు విషయమై ముత్తుకూరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా గురువారం సాయంత్రం వైద్య పరీక్షల కోసం వారిని వెంకటాచలం సీహెచ్‌సీకి తరలించారు. వైద్య పరీక్షలు చేయించారు. ఆ యువకుల శరీరంపై తీవ్ర గాయాలు ఉండడంతో వారి తల్లిదండ్రులు, బంధువులు, దళిత నాయకులు ఆందోళనకు దిగారు. తమ బిడ్డలను పోలీసులు అన్యాయంగా లాఠీలతో కొట్టారని, ఇలా ఎలా కొడతారని ప్రశ్నించారు. వైద్య పరీక్షల అనంతరం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచేందుకు ఆ యువకులను పోలీసు వాహనంలో నెల్లూరుకు తరలిస్తుండగా వారు అడ్డుకున్నారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పక్కనే ఉన్న టీడీపీ నాయకులు జోక్యం చేసుకొని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. అనంతరం ఆ యువకులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచేందుకు నెల్లూరుకు తరలించారు.

పోలీసుల తీరుపై ఆగ్రహం

ముత్తుకూరు ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి, కానిస్టేబుల్ సుమన్, వెంకటాచలం సీఐ సుబ్బారావు కలిసి తమ బిడ్డల్ని అన్యాయంగా చావగొట్టి, హత్యాయత్నం కేసు నమోదు చేశారంటూ పోలీసుల తీరుపై ఆ యువకుల తల్లులు, దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ బిడ్డలపై పెట్టిన కేసును వెంటనే ఎత్తివేయాలంటూ వారు డిమాండ్ చేశారు. తమ ఎదుటే తమ బిడ్డలకు మళ్లీ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. తప్పుడు హత్యాయత్నం కేసు పెట్టిన పోలీసులపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఏపీ ఫైబర్ నెట్ కేబుల్స్ దగ్ధం

ఆత్మకూరు, సెప్టెంబరు 12: మండలంలోని మహిమలూరు గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన గత కొద్ది రోజులుగా ఉన్న ఏపీ ఫైబర్ నెట్ కేబుల్స్ గురువారం దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఆత్మకూరు అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో కేబుల్ వైర్లు పూర్తిగా కాలిపోయాయి. అగ్ని ప్రమాదానికి కారణం తెలియరాలేదు.

ఆర్టీసీ బస్టాండులో రూ.5లక్షల నగల చోరీ

నెల్లూరు,(క్రైం), సెప్టెంబరు 12: బస్సుకోసం బస్టాండులో ఎదురు చూస్తున్న వృద్ధురాలి బ్యాగ్‌లోని నగలను దుండగులు దోచుకెళ్లిన ఘటన నెల్లూరులో గురువారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... పీ సెల్వరాజ్, జగన్మోహన్ లక్ష్మీప్రసన్న దంపతులు నగరంలోని ఉమ్మారెడ్డిగుంట ప్రాంతంలో నివసిస్తున్నారు. లక్ష్మీప్రసన్న తన కోడలితో కలిసి చెన్నై వెళ్లేందుకు గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఆర్టీసీ ప్రధాన బస్టాండుకు వచ్చారు. బెంచీపై కూర్చొని బస్సు కోసం నిరీక్షిస్తుండగా ఓ వ్యక్తి ఆమె బ్యాగ్ తెరిచి అందులోని రూ.5 లక్షల విలువ చేసే 100 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకెళ్లాడు. బాధితులు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఏ అయ్యప్ప కేసు నమోదు చేశారు. బస్టాండు ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	129
లేయర్ లైవ్	103
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	258
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6909
వెండి కిలో ధర	రూ. 85,500
వెండి ఒక గ్రాము	రూ. 88.50

వృద్ధుడిపై దౌర్జన్యం.. ఉంగరం దోపిడీ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 12: ఇంటికి నడుచుకుంటూ వెళుతున్న ఓ వృద్ధుడిని గుర్తు తెలియని దుండగుడు అటకాయించి ఆయన బంగారు ఉంగరం దోచుకెళ్లాడు. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు... నెల్లూరులోని హరనాథపురం రెండోవీధిలో వెంకటశేషకుమార్ నివసిస్తున్నారు. ఆయన ఈ నెల 10వ తేదీ రాత్రి హరనాథపురంలోని ఏటీఎం కేంద్రానికి వెళ్లి నగదు డ్రా చేసుకుని నడుచుకుంటూ ఇంటికి బయలుదేరారు. దారిలో గుర్తుతెలియని దుండగుడు బైక్‌పై వచ్చి వృద్ధుడిపై దౌర్జన్యం చేసి అతని చేతికున్న ఉంగరాన్ని దోచుకెళాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులతో చర్చించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా దొరసానమ్మ గంధ మహోత్సవం



గంధ లేపనం చేస్తున్న సజ్జాద ఎస్‌జిన్ ఫయాజ్ అహమ్మద్

ఏఎస్‌పేట, సెప్టెం బరు 12: దొరసానమ్మ గంధ మహోత్సవం వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో బుధ వారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు. సంప్రదయబద్ధంగా ఎస్‌జిఎన్ ఫయాజ్ అహమ్మద్ గంధ కలశాన్ని మేళ తాళలతో ఊరేగింపుగా దర్గాకు తరలించారు. దర్గాలోని స్వామి, అమ్మవార్లకు గంధ లేపనం చేసి ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు పంచిపెట్టారు. గంధ మహోత్సవం తిలకించేందుకు దేశ నలుమూలల నుండి వేలాది సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ ఆదేశాలతో సంఘం సీఐ వేమారెడ్డి, ఏఎస్‌పేట ఎస్ఐ సైదులు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నూతన బోధన విధానాలతో పురోగతి



తరగతి గదులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరశీలకురాలు కల్పన

ముత్తుకూరు, సెప్టెంబరు 12: నూతన బోధన విధానాలతో పాఠశాలల్లో విద్యాబోధన పురోగతి సాధించిందని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు కల్పన శైల తెలిపారు. బ్రహ్మదేవం, ముత్తుకూరు, జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర శిక్ష, బాలరక్షా భారత్ అండ్ ఎస్ఈఐఎల్ ఆధ్వర్యంలో తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల్లోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. తగరతిగది పాఠ్యాంశ బోధన విధానాలను పురోగతి వ్యూహాలతో పాఠ్యాంశాల బోధన ఏ విధంగా జరుగుతుందో పరిశీలించి ఉపాధ్యాయులకు సూలనలిచ్చారు. విద్యార్థులతో మాట్లాడి ఈ కార్యక్రమం ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎంవో సుధీర్‌బాబు, బాలరక్షా భారత్ ప్రతినిధి రఫీ, ఎంఈవోలు మధుసూదన్, హేమసుందర్ పాల్గొన్నారు.

ఇసుక డంపింగ్ కేంద్రం పరిశీలన



ఇసుక డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో మధులత

సంగం, సెప్టెంబరు 12: స్థానిక ఇసుక నిల్వ కేంద్రాన్ని తహసీల్దారు సోమ్లా నాయక్‌తో కలిసి ఆత్మకూరు ఆర్డీవో మధులత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె డ్రెడ్జింగ్ విధానంలో పడవల ద్వారా ఇసుక తీసే ప్రాంతాలను పరిశీలించారు. ఇసుక డంపింగ్ కేంద్రం వద్ద రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పడవల నుంచి ట్రాక్టర్లకు లోడ్ చేసే ఇసుక నిల్వ కేంద్రంలో అన్‌లోడ్ చేసేందుకు స్లిప్‌లు ఇస్తున్నామని తెలిపారు. పర్యవేక్షణకు రెవెన్యూ సిబ్బందిని నియమించామన్నారు. ఇసుక నిల్వ కేంద్రంలో సచివాలయ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి కృషి చేయాలి

- సమగ్రశిక్ష రాష్ట్ర పరిశీలకురాలు కల్పన



విద్యార్థులతో మాట్లాడుతున్న కల్పన

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 12 : పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్రశిక్ష రాష్ట్ర పరిశీలకురాలు కల్పన ఆదేశించారు. జిల్లాలోని టీపీ గూడూరు, ముత్తుకూరు మండలాల్లోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న అభ్యసన అభివృద్ధి కార్యక్రమ పురోగతిని గురువారం ఆమె పరిశీలించారు. ప్రభుత్వ కార్యక్రమాలను అధికారులు, ఉపాధ్యాయులు తప్పక అమలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యా ప్రమా ణాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంవో సుధీర్‌బాబు, బాల రక్షాభారత్ ప్రతినిధి రఫీ, ఎంఈవోలు మధుసూదన్, హేమసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

సూరాయపాలెంలోనే తక్కువ ధరకు ఇసుక డ్రెడ్జింగ్

- తట్ట ఎత్తకుండానే రూ.100కోట్ల దోపిడీ అనడానికి సిగ్గుందా ?
- 'కాకాణి'పై సోమిరెడ్డి ఫైర్



విలేకరులతో మాట్లాడుతున్న సోమిరెడ్డి తదితరులు

పొదలకూరు, సెప్టెంబరు 12: రాష్ట్రంలోనే అతి తక్కువ డ్రెడ్జింగ్ ధర సూరాయపాలెం రీచ్‌లోనేనని, తట్ట ఇసుక ఎత్తకుండానే రూ.100 కోట్ల దోపిడీ అనడానికి మాజీ మంత్రి కాకాణికి సిగ్గుందా...? అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం మండలంలోని సూరాయపాలెం డీసిల్టింగ్ పాయింట్, ఇసుక రీచ్, స్టాక్‌పాయింట్‌ను టీడీపీ నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సూరాయపాలెంలో ఇసుక అందుబాటులోకి రాకూడదనే కాకాణి కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారన్నారు. పడవల ద్వారా డ్రెడ్జింగ్ చేసేందుకు సంగంలో టన్ను ఇసుకకు రూ.140.88 నిర్ణయించగా, సూరాయపాలెంలో రూ.128.63గా నిర్ణయించారన్నారు. మాజీ మంత్రి కాకాణి నిబంధనల ప్రకారం క్యూబిక్ మీటరుకు రూ.231 చెల్లించకుండా, రూపాయి జీవో అడ్డం పెట్టుకుని రూ.కోట్లు దోచేశాడని దుయ్యబట్టారు. సర్వేపల్లి రిజర్వాయర్‌తోపాటు మిగిలిన చెరువులను వదిలిపెట్టకుండా మొత్తం 5.75లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని ఎత్తేసి లేఅవుట్లకు అమ్మేసుకున్నాడని తెలిపారు. ఈ సమావేశంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శిపారెడ్డి వంశీధర్‌రెడ్డి, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, స్థానిక టీడీపీ నాయకులు భూమి సురేంద్ర, తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

- బాలికకు దవడ కిందికి చేరిన పన్ను తొలగింపు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 12 : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఈఎన్‌టీ విభాగంలో గురవారం అరుదైన శస్త్రచికిత్స జరిగింది. నోటిలోని పన్ను సాధారణంగా పైకి పెరుగుతూ ఉంటుంది. అయితే ఓ బాలికకు దవడ కిందకు పన్ను పెరగటం వల్ల పెద్ద గడ్డ ఏర్పడి దవడ వాచిపోయి చీము పట్టింది ప్రమాదకరంగా మారింది. వివరాలిలా ఉన్నాయి... ఆత్మకూరు నియోజకవర్గం పడమటిపాళెంకు చెందిన తిరుపతయ్య, శ్రావణి దంపతుల కుమార్తె చెంచులక్ష్మి (12) కొద్దికాలంగా దవడ కుడివైపు వాచి తీవ్ర నొప్పితో అల్లాడుతోంది. ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించగా లక్ష రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఆ పేద కుటుంబం రెండు రోజుల క్రితం జీజీహెచ్‌ను సంప్రదించింది. ఈఎన్‌టీ వైద్య నిపుణుడు డాక్టర్ సుకుమార్ పరీక్షలు నిర్వహించి దవడలో నోటికి దిగువన పన్ను పెరుగుతున్నట్లు గుర్తించారు. వైద్య బృందం శస్త్రచికిత్స చేసి ఆ దంతాన్ని విజయవంతంగా తొలగించింది. ప్రస్తుతం బాలిక కోలుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో క్లిష్టమైన కేసులకు కూడా విజయవంతంగా శస్త్రచికిత్సలు చేస్తున్నామని చెప్పారు. బాలిక ఆపరేషన్‌లో ఈఎన్‌టీ డాక్టర్ శ్రీదేవి, మత్తు వైద్యులు సత్యనారాయణ, ఎంకే రెడ్డి భాగస్వామ్యులయ్యారని తెలియచేశారు.

దివ్యాంగుల సమగ్రాభివృద్ధికి కృషి

- సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి



మాట్లాడుతున్న ఏపీసీ ఉషారాణి

నెల్లూరు (విద్య): దివ్యాంగుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్ ఉషారాణి తెలిపారు. నెల్లూ రులోని ఇన్‌ఫాంట్ జీసెస్ సెంటర్‌లో గురువారం డిజిటల్ ట్యాబ్‌ల వినియోగంపై సహిత విద్య రీసోర్స్ పర్సన్లు, ఐఈ ఆర్‌పీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లా డారు. దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించి వారిలో అభ్యసనా నైపుణ్యాలను ఏ విధంగా పెంపొదించాలన్న అంశాలపై శిక్షణ అందిస్తున్నామన్నారు. అనంతరం డిజిటల్ విద్య, యాప్‌ల వినియోగంతోపాటు పలు అంశాలపై రాష్ట్ర రీసోర్స్ పర్సన్లు మహాలక్ష్మయ్య నాయుడు, సునీల్‌కుమార్ తర్ఫీదునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ వై నరసింహం, రాష్ట్ర సహిత విద్య సహాయ సమ న్వయ కర్త జీ మల్లికార్జునరావు, జిల్లా సహిత విద్య సమన్వయ కర్త కే పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు నాణ్యమైనవి అందుబాటులో ఉంచాలి

- జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 12 : జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను నాణ్యమైన అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఎరువుల తయారీదారులు, విత్తన ఉత్పత్తిదారులకు సూచించారు. గురువారం జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆమె వారితో సమావేశమయ్యారు. సోమశిల జలాశయంలో దాదాపు 49టీఎంసీల నీరు చేరిందని, జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి సుమారు 5లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యే అవకాశం ఉందని చెప్పారు. ప్రధానంగా వరి, శనగ, ఉద్యాన పంటలకు సంబంధించి 1.20లక్షల టన్నుల యూరియా, 1.23లక్షల టన్నుల డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. వాటిని రైతులకు దశలవారీగా డీలర్లు, సహకార సంఘాల ద్వారా అందించేందుకు సహకరించాలని సూచించారు. వరి, శనగ, మినుము తదితర పంటలకు సంబంధించి దాదాపు లక్ష క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని, విత్తనోత్పత్తిదారులు సకాలంలో రైతులకు విత్తనాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కేఎన్ఎం-733, ఆర్ఎన్ఆర్-15048, బీపీటీ-5204, ఎన్ఎల్ఆర్-34449 వరి రకాలను రైతులు ఎక్కువగా సాగుచేసే అవకాశం ఉందని, వాటిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నాణ్యత లోపించిన విత్తనాలు, ఎరువులు సరఫరా చేసినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏడీఏలు నర్సోజీరావు, శ్రీనివాసులు. నెల్లూరు ఏవో నాగమోహన్, కార్యాలయ ఏవో మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమలు నడపాలి

- జెడ్‌ఎం వీరశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఐఐసీ జెడ్ఎం వీరశేఖర్ రెడ్డి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 12 : జిల్లాలో పరిశ్రమల నిమిత్తం భూమిని కొనుగోలు చేసి, ఖాళీగా ఉంచిన ప్రతీ ప్లాట్లో పరిశ్రమ నడపాలని ఏపీఐఐసీ జెడ్ఎం ఎస్ వీరశేఖర్‌రెడ్డి కోరారు. పరిశ్రమల కోసం భూమిని కొనుగోలు చేసి ఖాళీగా ఉంచిన పారిశ్రామి కవేత్తలతో నెల్లూరు ఏకే నగర్‌లోని ఏపీ ఐఐసీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. జెడ్ఎం మాట్లా డుతూ జిల్లాల పునర్విభజన తరువాత నెల్లూరు జిల్లాలో భూబ్యాంక్ తగ్గిపోయిం దని, ఈ నేపథ్యంలో ఉన్న భూములను కూడా ఖాళీగా ఉంచితే ఎలాగని ప్రశ్నిం చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఖాళీ భూముల్లో వెంటనే పరిశ్రమలను సొంతంగా స్థాపించడంగానీ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు లీజుకు ఇవ్వడంగానీ చేయాలని సూచించారు. ప్రధానంగా వెంకటాచలం పారిశ్రామికవాడలో దాదాపు 41 ప్లాట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఇలా అనేక చోట్ల పరిశ్రమల కోసం కొనుగోలు చేసిన భూమిలో వెంటనే పరిశ్రమలు స్థాపించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐలా కమిషనర్ బ్రహ్మయ్య, పరిశ్రమలశాఖ డీడీ షఫీ, ఏపీఐఐసీ డీజెడ్ఎం ఎస్ వెంకట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రేపటి నుంచి స్వచ్ఛతా హి సేవా

లింగసముద్రం, సెప్టెంబరు 12: మహాత్మాగాంధీ జయంతి, స్వచ్ఛభారత్ మిషన్ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 14 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు మండలంలో స్వచ్ఛతా హై సేవా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ రామసుబ్బారావు గురువారం తెలిపారు.

రాళ్లపాడులో నిమజ్జనం వద్దు

లింగసముద్రం, సెప్టెంబరు 12: రాళ్లపాడు ప్రాజెక్టు లోతట్టు ప్రాంతంలో గణేష్ విగ్రహాల నిమజ్జనం చేయకూడదని ప్రాజెక్టు ఏఈ చంద్రమౌళి లింగసముద్రం, కొండాపురం మండలాల ప్రజలకు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహాలను లోతట్టులో వేస్తే తాగునీరు కలుషితం అవుతుందన్నారు. ప్రాజెక్టు కొత్త గేట్ల ముందు ఉన్న గైడ్‌బండ్, మన్నేరులో నిమజ్జనం చేసుకోవాలన్నారు. అలా కాకుండా ప్రాజెక్టులో నిమజ్జనం చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటాని పేర్కొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ విచారణ

కొండాపురం, సెప్టెంబరు 12: స్థానిక మండల కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధిహామీ 16వ విడత సామాజిక తనిఖీ బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు ఏపీవో చెంచయ్య తెలిపారు. మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2014 మార్చి మధ్యకాలంలో జరిగిన ఉపాధి పనులపై ఈ నెల 1 వ తేదీ నుంచి సిబ్బంది సామాజిక తనిఖీ, 5 వ తేదీ నుండి 11వరకు గ్రామసభలు నిర్వహించినట్లు గుర్తుచేశారు. బహిరంగ విచారణకు మండల ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు హాజరుకావాలని కోరారు.

రేపు కావలిలో మెగా లోక్ అదాలత్

కావలి రూరల్, సెప్టెంబరు 12: పట్టణంలో శనివారం జరుగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టు కురాని కేసులు, పెండింగ్ కేసులు ఖర్చు. కాలయాపన లేని అప్పీల్ లేని అంతిమ తీర్పు లోక్ అదాలత్‌లో వస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయ సహాయం ఇస్తామన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 12: పట్టణం డిగ్రీ కళాశాల సమీపంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేసి గిట్టుబాటు కూలి పొందాలన్నారు. పనుల వద్ద కూలీలకు సిబ్బంది వసతులు కల్పించాలన్నారు. అనంతరం జాబ్‌కార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు అందజేశారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 12: పట్టణంలోని బెస్తవీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద గురువారం టీడీపీ నాయకులు, నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్, నాయకులు సందానీ, అఖిల్, కాంతారావు, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన రోటరీక్లబ్ సభ్యులు

జలదంకి, సెప్టెంబరు 12: జమ్మలపాలెం సాయి నర్సింగ్ కాలేజీ ఆవరణలో గురువారం కావలి రోటరీక్లబ్ సభ్యులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు స్వర్ణలత మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం కాలేజీ కరస్పాండెంట్ దశరథ రామిరెడ్డిని రోటరీక్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, క్లబ్ సభ్యులు హరినారపరెడ్డి, కొండారెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

కంద్రా మాల్యాద్రికి పితృవియోగం

కందుకూరు, సెప్టెంబరు 12: నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు, పార్టీ పట్టణ మాజీఅధ్యక్షుడు కంద్రా మాల్యాద్రి తండ్రి సోమయ్య గురువారం సాయంత్రం మృతి చెందారు. వయోభారంతో ఆయన చుట్టుగుంటలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఏచూరి మరణం తీరనిలోటు

కందుకూరు, సెప్టెంబరు 12: సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని నియోజకవర్గ సీపీఐ నేతలు మాలకొండయ్య, షేక్ హుస్సేన్‌లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి ఉద్యమదశ నుంచే వామపక్ష భావజాలం అలవర్చుకుని దోపిడీలేని వర్గరహిత సమాజం కోసం ఏచూరి ఎనలేని కృషిచేశారన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

కందుకూరు, సెప్టెంబరు 12: స్థానిక ఏకలవ్యనగర్ వద్ద ఈ నెల 2న జరిగిన ద్విచక్ర వాహనాల ప్రమాదంలో గాయపడిన బాలవెంకట మణికంఠ ఒంగోలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందారు. పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలకు వెళ్లిన యువకులు మోటారుసైకిళ్లు ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా మణికంఠ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే.

ప్లాంటేషన్ల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరికుంటపాడు, సెప్టెంబరు 12: మండలంలోని కనియంపాడు, విరువూరు ప్లాంటేషన్‌లలో నాటిన మొక్క లను గురువారం కావలి సబ్ డీఎఫ్‌వో రాజశేఖర్ పరిశీలిం చారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'కోటికి ఎసరు' కథనా నికి స్పందించిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన ఆయా ప్లాంటేషన్‌లను పరిశీలించి మొక్కలు నాటే విధా నం తదితర అంశాలపై ఆరా తీశారు. పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా నిబంధనల మేరకు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

ఆక్రమణలో రామన్న చెరువు

● ఆందోళనలో ఆయకట్టుదారులు ● చోద్యం చూస్తున్న అధికారులు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 12: మండలకేంద్రం సమీపంలోని రామన్నచెరువు ఆక్ర మణలతో రోజురోజుకు కుంచించుకపోతుంది. చెరువు లోతట్టు ప్రాంతం విస్తీర్ణం సుమారు 110ఎకరాలు ఉండగా ప్రస్తుతం 70ఎకరాలు మాత్రమే ఉంది. సుమారు 40 ఎకరాలకు పైగానే లోతట్టు ప్రాంతం ఆక్రమణలకు గురైంది. వర్షాభావంతో గత 15ఏళ్ల నుండి చెరువులోకి వర్షం నీళ్లు రాకపోవడంతో చుట్టుప్రక్కల పొలాలు కలిగిన రైతులు లోతట్టు ప్రాతంలోని చిల్లచెట్లు పీకేసి భూమిని చదును చేసి గట్టు వేసి ఆక్రమించేస్తున్నారు. అలాగే వీటికి విద్యుత్ మోటర్లు వేసి ఉద్యాన పంటలు, నిమ్మ, బత్తాయి, మొక్కలు వేసి లక్షలు లాభాలు ఆర్జిస్తున్నారు. ఆక్రమించిన భూములకు చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్నారు. చెరువులో సుమారు 30 లక్షలకు పైగా విలువ కలిగిన చిల్లకర్ర ఉంది. గత ఏడాది నాలుగైదు లక్షలు విలువ కలిగిన చిల్లకర్రను నిరికివేసి పొగాకు బ్యారనీలకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. అలాగే ఇటుకబట్టీల యజమానులు మట్టిని తరలిస్తున్నారు. ఈ ఆక్రమణలతో నీటి సామర్థ్యం తగ్గి నీరంతా వృథాగా పోయే అవకాశం ఉందని చెరువు కింది వంద ఎకరాలల్లో సాగులో ఉన్న ఆయకట్టుదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువు హద్దులు నిర్ణయించి, పరిరక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


రామన్నచెరువు భూమిని ఆక్రమించి సాగు చేసిన పశుగ్రాసం

వైసీపీ పాలనలో పడకేసిన పారిశ్రామిక ప్రగతి

● మొక్కుబడిగా మిగిలిన ఇండస్ట్రియల్ పార్కు
● నిరుద్యోగుల ఆశలు ఆవిరి


అలంకారప్రాయంగా ఉన్న రోడ్డు


నారంపేట వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు వేసిన శిలాఫలకం

ఆత్మకూరు, సెప్టెంబరు 12: వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలో పారిశ్రామిక ప్రగతి పడకేసింది. పరిశ్రమల ఏర్పాటు కలగా మిగిలింది. నారంపేట వద్ద ఏర్పాటుచేసిన ఇండస్ట్రియల్ పార్కు మొక్కుబడిగా మిగిలింది. మండలంలోని నారంపేట సమీపంలో జాతీయ రహదారి పక్కనే 173ఎకరాల్లో నూతనంగా ఇండస్ట్రియల్ పార్కుకు దివంగత రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి 2020 సెప్టెంబరు 20న శంకుస్థాపన చేశారు. దాని అభివృద్ధికి మొదటివిడతగా సుమారు రూ.30కోట్ల రూపాయల మేర నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో 87ఎకరాల్లో మాత్రం కేవలం రోడ్లు, డ్రైనేజీ పనులు జరిగాయి. మిగిలిన 87ఎకరాలు అభివృద్ధికి నోచుకోలేదు. ఈ 87 ఎకరాల్లో సెంచరీ ఫ్లైవుడ్ పరిశ్రమ స్థాపించేందుకు సంబంధిత యాజమాన్యం భూములు పరిశీలించి వెళ్లింది. అయితే ఈ పరిశ్రమ ఎట్టకేలకు బద్వేల్‌కు తరలివెళ్లింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటు ఊసే లేకపోవడం గమనార్హం.

పారిశ్రామిక ప్రగతికి గ్రహణం

ఆత్మకూరులో సెంచరీ ఫ్లైవుడ్ పరిశ్రమ ఏర్పాటుచేసి ఉంటే రూ. 1600 కోట్లు పెట్టుబడులు, 2500 పైచిలుకు ప్రత్యక్ష ఉద్యోగాలు, మరో 500 మంది వరకు పరోక్ష ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చి ఉండేవి. జామాయిల్ రైతులకు ఎంతో ఉపయోగకరమైన ఈ పరిశ్రమతో పాటు అనుబంధ పరిశ్రమలు అందుబాటులోకి వచ్చి పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతామని ఆశించామని, అయితే నిరాశే మిగిలిందని, ఇకనైనా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజలు, నిరుద్యోగ యువత కోరుతున్నారు.

వరద బాధితులకు దాతల చేయూత


మంత్రి లోకేష్‌కు విరాళం ఇస్తున్న కందుకూరు ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కావలి టౌన్, సెప్టెంబరు 12: బీసీ ఐక్యవేదిక సభ్యులు గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కు మార్ చేతుల మీదుగా విజయవాడలోని వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్, న్యాయవాది సాయిప్రసాద్, చిన్ని వరప్రసాద్, గౌరిశంకర్, చంద్రమౌళి, నారాయణ, గిరి పాల్గొన్నారు.

కందుకూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం నియోజకవర్గం ఫర్టిలైజర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.2లక్షలు విరాళం అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఐటీ శాఖామంత్రి నారా లోకేష్‌కు ఈ విరాళాన్ని అందజేశారు.


దుప్పట్లు పంపిణీలో కమిషనర్ శ్రావణ్‌కుమార్, నేతలు

రాధారమణ సేవలు మరువలేనివి


రాధారమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 12: మెట్ట ప్రాంతంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పారిశ్రామికవేత్త బత్తుల రాధారమణ చేసిన కృషి మరువలేనిదని పలువురు నాయకులు పేర్కొన్నారు. గురువారం గంగిరెడ్డిపల్లిలో జరిగిన రాధారమణ ఉత్తర క్రియల్లో పలు పార్టీల నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనం తరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెం కట రెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్, మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, టీడీపీ అధికార ప్రతినిధి చల్లా ప్రసాద్, నాయకులు కరమతుల్లాబాషా, సందానీ, తుమ్మల కిరణ్, అలీజాన్, ఇలియాజ్ తదితరులున్నారు.

మంత్రి ఆనం పరామర్శ


సుబ్బరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆనం

అనంతసాగరం, సెప్టెంబరు 12: మండల టీడీపీ అధ్యక్షురాలు మునగపాటి సునీత, ఆమె కుటుంబ సభ్యులను గురువారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చిలకలమర్రిలో పరామర్శించారు. సునీత భర్త మాజీ ఎంపీపీ సుబ్బరాజు ఇటీవల మృతిచెందడంతో ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చెరువు పోరంబోకు భూమిలో పనులు చేపడితే చర్యలు

కలువాయి, సెప్టెంబరు 12: చెరువు పోరంబోకు భూమిలో పనులు చేపడితే చర్యలు తీసుకుంటామని ఆక్రమణదారుడిని హెచ్చరించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మాదన్నగారిపల్లె సర్వే నెం 56లోని చెరువు పోరంబోకు భూమిని కొందరు ఆక్ర మించి చదును చేస్తున్నట్లు గురువారం తహసీల్దారు సంజీవకుమారికి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆర్ఐ మస్తాన్‌వలీ, వీఆర్వో జనార్థన్ పరిశీలించి ఎలాంటి పనులు చేపట్టినా చర్యలు తీసు కుంటామని ఆక్రమణదారుడిని హెచ్చరిం చినట్లు తెలిపారు.


చెరువు పోరంబోకు భూమిని పరిశీలిస్తున్న ఆర్ఐ మస్తాన్‌వలీ

హోంగార్డు మృతికి సంతాపం


హోంగార్డ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సీఐ వెంకట్రావు

సీతారామపురం, సెప్టెంబరు 12: స్థానిక పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ ఖాదర్ అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. గురువారం స్వగ్రామమైన సీతారామపురంలో అబ్దుల్ ఖాదర్ మృతదేహానికి ఉదయగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, సీతారామపురం పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ వెంకటసుబ్బయ్య, హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్, పోలీస్ సిబ్బంది నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై సీడీపీవో విచారణ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 12: కొండసముద్రం అంగన్‌వాడీ కేంద్రం-2 కార్యకర్త తాటిపర్తి శిరీషాపై కందుకూరు ఐసీడీఎస్ సీడీపీఓ శర్మిష్ట గురువారం విచారణ చేపట్టారు. శిరీషా ఉద్యోగం కోసం స్థానిక పత్రాలు సృష్టించి అధికారులను తప్పుదోవ పట్టించినట్లు గ్రామస్థులు గ్రీవెన్‌సెల్‌లో వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. శిరీషా పుట్టినిల్లు మాత్రమే కొండసముద్రం అని ఆమె భర్త కళవళ్ల గ్రామం అని గ్రామస్థులు సీడీపీఓకు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, స్థానికులు మన్నం చిరంజీవి, నల్లమోతు రాంబాబు, ఉన్నం సురేష్‌బాబు, గుర్రం నాగార్జున పాల్గొన్నారు.

రూ.4లక్షలు పలికిన లడ్డూ


లడ్డూతో గుండాబత్తిన మాలకొండయ్య కుటుంబసభ్యులు

కందుకూరు, సెప్టెంబరు 12: విక్కిరాలపేట వినాయకుని విగ్రహం వద్ద గురువారం నిర్వహించిన లడ్డూకు వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన గుండాబత్తిన మాలకొండయ్య రూ.4లక్షలకు అత్యధికంగా వేలం పాడి దక్కించుకున్నారు. అనంతరం మేళతాళాలు మధ్య అట్టహాసంగా ఆయన లడ్డూను తన ఇంటికి తీసుకెళ్లారు.

కందుకూరు ఆర్టీవోగా లక్ష్మి

కందుకూరు, సెప్టెంబరు 12: స్థానిక ప్రాం తీయ రవాణా శాఖ కార్యాలయంలో ఆర్టీఓ టీవీఎస్ లక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె చిల కలూరిపేట ఎంవీఐగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. సిబ్బంది స్వాగతం పలికారు.



కుమారైను వేధిస్తున్నాడని తల్లి ఫిర్యాదు

కావలి రూరల్, సెప్టెంబరు 12: స్థానిక క్రిష్టియన్‌పేటలో ఉంటున్న తమ కుమారైను పట్టణానికి చెందిన జక్కంపూడి సుబ్బానాయుడు వేధిస్తున్నాడని గురువారం రాత్రి ఒక మహిళ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమార్తె పర్సనల్ ఫొటోలు, వీడియోలు అందరికి పంపుతానని బెదిరించటంతో పాటు కళాశాలకు వెళ్తుండగా స్కూటీని అడ్డగిస్తూ బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ మేరకుకేసు నమోదు చేశామన్నారు.

ఉత్తర కాలువకు నీరు విడుదల చేయాలి

● సీపీఎం నాయకుల డిమాండ్

అనంతసాగరం, సెప్టెంబరు 12: సోమశిల జలాశయానికి వరద జలాలు వస్తున్న తరుణంలో ఉత్తర కాలువకు నీరు ఇవ్వాలని సీపీఎం నాయకులు పుల్లయ్య, అన్వర్‌బాషా డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉత్తర కాలువ పరిధిలో ఉన్న చెరువులకు నీరు లేక ఎండిపోవడంతో రైతులు, మూగజీవాలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ యంత్రాగం చొరవ చూపి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్, ఖాజామొహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం చేయలేని జగన్ విమర్శలా..?

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ దోపిడీ లెక్కలు తేలాలి
● బీజేపీ రాష్ట్ర కార్యకర్గ సభ్యుడు భరత్‌కుమార్

కావలి టౌన్, సెప్టెంబరు 12: వరద బాధితులకు సాయం చేయలేని జగన్ చేసేవారిని విమర్శించడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో జరిగిన ఆయన బీజేపీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలకులు వరదలు వస్తే ఏరియల్ రివ్యూలకు పరిమితమైందని గుర్తుచేశారు. వరద బాధితలను ఆదుకునేందుకు అహర్నిశలు కష్టపడిన కూటమి నేతలను విమర్శించడం సిగ్గుచేటన్నారు. కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అవినీతి, అన్యాయాలను ప్రజలు తెలుసుకున్నారని చెప్పారు. కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం సొమ్మును స్వాహా చేశారని మండిపడ్డారు. ఆయన ఇంటిముందు అసైన్‌మెంట్ స్థలాన్ని ఆక్రమించారని ఆరోపించారు. బీజేపీ సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బ్రహ్మానందం, పురుసు వెంకటేశ్వర్లు, మందా కిరణ్, సుజిత్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో బీజేపీ నేత భరత్‌కుమార్

ఎమ్మార్సీకి సెమిస్టర్-2 పుస్తకాలు

లింగసముద్రం, సెప్టెంబరు 12: స్థానిక మండల విద్యావనరుల కేంద్రానికి గురువారం సెమిస్టర్-2 కి సంబంధించిన పుస్తకాలు వచ్చాయి. 1వ తరగతి నుండి 10వ తరగతికి వరకు కొన్ని సబ్జక్టులకు చెందిన పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ-2 శివకుమార్ తెలి పారు. పుస్తకాలను త్వరలో అన్ని పాఠశాలలు, హైస్కూళ్లకు పంపిణీ చేయ నున్నట్లు చెప్పారు.


పుస్తకాలు దించుతున్న కూలీలు

కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నిరసన


వైద్యశాల ఎదుట నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు

కావలి టౌన్, సెప్టెంబ రు 12: తమను పర్మినెంట్ చేయాలని కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు గురువారం ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షుడు పసుపు లేటి పెంచులయ్య మాట్లాడా రు. స్థానిక ఏరియా వైద్యశాలలో 15ఏళ్ల నుంచి పనిచేస్తున్న ప్రభుత్వం పర్మి నెంట్ చేయకపోవడం విచారకరమన్నారు. కరోనా కష్టకాలంలో విధులు నిర్వహిస్తే పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపాల్, మధుసూదన్‌రావు, స్టాఫ్ నర్సులు నూర్జహాన్, రాజ్యలక్ష్మి, స్వాతి, రాధిక, కల్యాణి పాల్గొన్నారు.

కంప్యూటరైజ్డ్‌కు సహకరించండి

అల్లూరు, సెప్టెంబరు 12: సహకార సంఘాల సభ్యుల పేర్లు కంప్యూటరైజ్ చేస్తున్నట్లు సంఘంలోని ప్రతి ఖాతాదారుడు అందుకు సహకరించాలని పర్సన్ ఇన్‌చార్జి రమేష్‌బాబు కోరారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మహాజనసభలో ఆయన మాట్లాడారు. ఆధార్, పాన్, భూమి పాసుబుక్కు, రెండు ఫొటోలను అందజేయాలన్నారు. పూర్తి వివరాలను అందజేస్తే కంప్యూటరీకరణలో వివరాలు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో గోగుల శ్రీనివాసులు, సీనియర్ ఇన్‌పెక్టర్ సత్యనారాయణ, బ్యాంక్ మేనేజరు స్వప్న, సూపర్‌వైజర్ మహేష్, పీఏసీఎస్ సీఈవో రాధయ్య పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుల వితరణ

కావలి టౌన్, సెప్టెంబరు 12: బుడమగుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం విశ్రాంత ఉపాధ్యాయులు సమ దుస్తులు కుట్టించుట, స్టేషనరీ, పౌష్టికాహారం కోసం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సిద్దిక్, సుధాకర్, షేక్ జిలానీ బాష, కుమ్మరకొండూరు, ఉమామహేశ్వరశర్మ పాల్గొన్నారు. స్థానిక ఉపాధ్యాయులు రామారావు, ప్రసాద్‌లు వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఏ ఎస్ పేట, సెప్టెంబరు 12: మహత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు రూ.300కూలి గిట్టుబాటు అయ్యేలా పనిచేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. గురువారం ఆయన అక్బరాబాదులో జరుగుతున్న పనులను పరిశీలించారు. కొలతల ప్రకారం పనిచేయాలని, తద్వారా అత్యధికంగా కూలీ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సతీష్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

చవటపల్లి, వెదనపర్తికి ఆర్టీసీ బస్సు సౌకర్యం

కలువాయి, సెప్టెంబరు 12: వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవతో గురువారం నుంచి చవటపల్లి, వెదనపర్తి గ్రామాలకు ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం ప్రారంభించారు. కలువాయి నుంచి నెల్లూరుకు చీపినాపి, పర్లకొండ రింగ్‌రోడ్డులో నడిచే ఈ బస్సు వెరుబొట్లపల్లి నుంచి వెదనపర్తి, చవటపల్లి మీదుగా ఆదూరుపల్లికి చేరుకుంటుంది. ఉదయం 9గంటలకు నెల్లూరు వైపు, సాయంత్రం 4గంటలకు కలువాయి వైపు ఈ బస్సు సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగదల్ నాయుడు, దనియాల చంద్రయ్య నాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రహదారులపై పశువుల సంచారం

● ప్రమాదాల బారిన వాహన చోదకులు


బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

సీతారామపురం, సెప్టెంబరు 12 : మండలంలోని రోడ్లు, ప్రధాన కూడళ్లలో పశువుల సంచారంతో ప్రజలు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. సీతారామపురం బస్టాండు, మెయిన్ బజార్, సీతారామపురం పరిసరాల్లో పశువులు ఎక్కువగా సంచరిస్తూ వ్యాపారులు, కొనుగోలుదారుల చేతుల్లోని కూరగాయలను తినేస్తున్నాయి. వాటి యజమానులు పాలు ఇచ్చే సమయానికి ఇంటికి తోలుకెళ్లి తర్వాత బహిరంగ ప్రదేశాల్లో విడిచి పెట్టేస్తుండడంతో రాత్రి, పగలూ తేడా లేకుండా గుంపులు గుంపులుగా బస్టాండు సెంటర్‌లో సంచరిస్తున్నాయి. ప్రధాన రహదారులపై అడ్డుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి పశువుల యజమానులపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కన మతిస్థిమితం లేని వ్యక్తి

● పోలీసులకు స్థానికుల సమాచారం

సంగం, సెప్టెంబరు 12: మండలపరిధిలోని జంగాలదొరువు శివారులో మధుసూధన్‌రెడ్డి అనే రైతు పొలానికి సమీపంలో రోడ్డు పక్కన ఓ మతిస్థితిమితంలేని ఓ వ్యక్తి గత ఐదు రోజులుగా పడి ఉన్నాడు. ఇతని చేతికి గొలుసులు వేసి ఉన్నాయి. ఇతను ఏయస్‌పేట దర్గా నుంచి తప్పించుకుని వచ్చిన వాడుగా భావిస్తున్నారు. దర్గా నిర్వాహకులు స్పందించి మతిస్థిమితంలేని వ్యక్తిని దర్గాకు తీసుకెళ్లి బంధువులకు సమాచారం అందించాలని స్థానికులు కోరుతున్నారు. స్థానిక పోలీసులకు సమాచారమిచినట్లు రైతు తెలిపాడు.

భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ పారాయణం


సంగమేశ్వరాలయంలో లలిత సహస్ర నామాన్ని పఠిస్తున్న మహిళలు

సంగం, సెప్టెంబరు 12: స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో గురువారం మహిళలు లలిత సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో చేశారు. హిందూ ధర్మ ప్రచార మహాసభ ఆధ్వర్యంలో ఉదయం 11-30 గంటలకు దేశ వ్యాప్తంగా లక్ష మంది మహిళలు లలితా సహస్రనామ పారాయణ చేయాలని నిర్ణయించారు. ఆమేరకు సంగమేశ్వరాలయంలో మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి లలిత సహస్రనామ పారాయణం చేశారు.

లక్ష్యాలను అధిగమించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 12: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని మండల ప్రత్యేకాధికారి పద్మావతి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ అతిథిగృహంలో పక్కాగృహాల నిర్మాణాలపై మండల స్థాయి అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వర్కు ఇన్‌స్పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్చి చివరి నాటి కి పక్కాగృహాల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

పొలం కోతకు గురైతే మక్తా కట్టాలట !

● కౌలురైతు ఆవేదన



నోటీసు చూపుతున్న కౌలురైతు

విడవలూరు, సెప్టెంబరు 12: వరదలకు పొలం కోతకు గురైయితే మక్తా కట్టాలని నోటీసులు ఇచ్చారని పార్లపల్లికి చెందిన కౌలు రైతు తుమ్మలపెంట రాజేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక అలఘనాథస్వామి ఆలయానికి చెందిన సుమారు 24 ఎకరాలకు కౌలువేలం పాడానన్నారు. 2022లో వచ్చిన వరదల్లో అందులో 40 సెంట్ల భూమి కోతకు గురైందన్నారు. ఆ పొలాన్ని బాగుచేయాలని దేవదాయశాఖ అధికారులకు మొరపెట్టుకున్నానని చెప్పారు. వారు చదును చేయకపోవటంతో రెండేళ్లుగా పంట వేయలేదన్నారు. పైగా కోతకు గురైన పొలానికి రూ. 41వేలు మక్తా కట్టాలని దేవదాయశాఖ అధికారులు నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. పంట వేయనప్పుడు మక్తా ఎందుకు కట్టాలని అడిగితే తమకు సంబంధం లేదని వారు అన్నారని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

విద్యాసంస్థలకు ఆర్థిక సాయం

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 12: మండలంలోని కోవెరపాలెంలో గురువారం స్విమ్స్ మాజీ డైరెక్టర్ జీ సుబ్రహ్మణ్యం తనతల్లి కామేశ్వరమ్మ 12వ వర్థంతి సందర్భంగా శివాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతిలోని పద్మావతి మెడికల్ కాలేజీకి, ఎస్వీ యూనివర్సిటీకి, ఏర్పేడులోని విద్యా సంస్థలకు తన వంతు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. తోటపల్లిగూడూరు ఉన్నత పాఠశాలకు ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జీ గురునాథం, జీ సుధాకర్, డీఎల్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వహిస్తే చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు12: ప్రభుత్వ ఇళ్ల నిర్మాణంలో అలసత్వం చేస్తే చర్యలు తప్పవని మెప్మా పీడీ రవీంద్ర హెచ్చరించారు. గురువారం బుచ్చి మండల పరిషత్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్, మెప్మా, ఎన్ఆర్ఈజీఎస్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బుచ్చి అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో అరకొర నిర్మాణాలతో ఉన్న ఇళ్లను మార్చిలోగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో నరసింహారావు, ఏపీఎం లలితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్పునకు ఎంపిక

ఇందుకూరుపేట, సెప్టెంబరు 12: మండలంలోని నరసాపురం ఎంవీ ఆర్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మేకల లావణ్య నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)నకు ఎంపికైంది. లావణ్య ప్రతిఏటా రూ.12వేల చొప్పున నాలుగేళ్లపాటు అందుకోనున్నది. ఆమె ఎంపికపై పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పీ నాగేశ్వరరావు, షాహీనా, పర్వీన్, పీఈటీ ముజీర్, విద్యా కమిటీ ఛైర్మన్ పీ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'కడియాల'కు సోమిరెడ్డి నివాళి

పొదలకూరు, సెప్టెంబరు 12: మండలంలోని తాటిపర్తికి చెందిన పొదలకూరు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ కడియాల చిన్మయరెడ్డి (మారుతి) తండ్రి సోమశేఖర్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాళి అర్పించారు. సోమశేఖర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో చనిపోగా, గురువారం పెద్దకర్మ జరిగింది. సోమిరెడ్డి వారి స్వగృహానికి విచ్చేసి సోమశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సోమిరెడ్డి వెంట తాటిపర్తి టీడీపీ నాయకులు హనుమారెడ్డి, కసిరెడ్డి సుజిత్‌రెడ్డి, కండే మస్తానయ్య, సుబ్బారెడ్డి, తదితరులు ఉన్నారు.

గ్రావెల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

కొడవలూరు సెప్టెంబరు 12: మండలంలోని పెయ్యలపాళెంలో వైసీపీ నాయకులు గ్రావెల్‌ను, మట్టిని దోచుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు ప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు, పెయ్యలపాళెంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం మైనింగ్ అధికారులు ఓ వైసీపీ చోటా నాయకుడి స్థలంలో భారీగా డంప్ చేసి ఉన్న గ్రావెల్,ఇసుక,మట్టి, కంకరను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. సీజ్ చేసిన ఇసుక, గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో పాలకులు ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు.కోవూరును అవినీతి రహిత నియోజకవర్గంగా మార్చేందుకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ప్రజాధనాన్ని దోచుకున్న అక్రమార్కులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి జిల్లాతో ఎనలేని అనుబంధం ఉంది. ఆయన తీవ్ర అనారోగ్యంతో గురువారం ఢిల్లీలో తుదిశ్వాస విడిచారు. దీంతో పార్టీ జిల్లా నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మృతి నేపథ్యంలో ఏచూరి జిల్లాకు వచ్చిన సందర్భాలను వామపక్ష శ్రేణులు గుర్తు చేసుకుంటున్నాయి.

ఏచూరితో ఎనలేని అనుబంధం

● జిల్లాకు మూడుసార్లు వచ్చిన సీపీఎం అగ్రనేత ● సీతారాం మృతికి నాయకుల సంతాపం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 12 : రాష్ట్రంలోని కాకినాడలో జన్మించిన ఏచూరి ఢిల్లీలోని జవహర్‌లాల్ యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. ఎస్ఎఫ్ఐ నేత నుంచి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగిన సీతారాం ఏచూరి పలు ప్రజాసమస్యలపై పోరాటటమే కాకుండా మూడు సార్లు రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1999లో జరిగిన నెల్లూరు లోక్‌సభ ఎన్నికలలో సీపీఎం అభ్యర్థి భానురాజు తరఫున ప్రచారంలో సీతారాం పాల్గొన్నారు. 2009లో నెల్లూరులో జరిగిన సీపీఎం జిల్లా సమీక్షలో పాల్గొని పార్టీ శ్రేణులకు మార్గనిర్దేశం చేశారు. 2018లో నెల్లూరు నర్తకి సెంటర్‌లో జరిగిన పార్టీ నేత జక్కావెంకయ్య సంతాపసభకు హాజరై వెంకయ్య సేవలను కొనియాడారు. డాక్టర్ జెట్టి శేషారెడ్డి ట్రస్టును సందరించి దాన్ని సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని పార్టీ నేతలకు సూచించారు. ఏచూరి మృతికి సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మాజీ కార్యదర్శి చంద్ర రాజగోపాల్ సంతాపాన్ని ప్రకటించారు. నగరంలోని ముత్తుకూరు బస్టాండ్ సెంటర్‌లో ఏచూరి చిత్రపటానికి సీపీఎం శ్రేణులు నివాళులర్పించాయి. ఆయన సేవలను నాయకులు కొనియాడారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు నరసింహ, శ్రీనివాసులు, కత్తి పద్మ, ఆనంద్‌కుమార్, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.



జక్కా వెంకయ్య సంతాప సభలో ప్రసంగిస్తున్న ఏచూరి సీతారాం (ఫైల్)

సీతారాం మరణం విచారకరం..

● మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేస్తూ నిరంతరం ప్రజాఉద్యమాల్లో గడిపిన సీతారాం ఏచూరి కానరాని లోకాలకు చేర టం బాధాకర మన్నారు. 1974లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన మచ్చలేని నేతగా గుర్తింపు పొందారన్నారు. రాజ్యసభ సభ్యుడిగా పెద్దల సభలో ప్రజావాణిని వినిపించారన్నారు. సీతారాం ఏచూరి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నామన్నారు.

● దేశం గర్వించ దగ్గ ప్రజానాయకుడిగా సీతారాం ఏచూరి పేరు తెచ్చుకున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్ ఓ ప్రటనలో తెలియచేశారు. ఆయన మరణంతో ప్రశ్నించే గొంతుకను కోల్పోయామన్నారు. రాజ్యాంగ హక్కుల సాధనకై, అణగారిని వర్గాల గొంతుకై నిలిచిన ఏచూరి తెలుగువాడు కావటం గర్వకారణమన్నారు.

● సీతారాం ఏచూరి మరణం కలిచి వేసిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2004లో యూపీఏ సంకీర్ణ ప్రభుత్వం నిర్మాణంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఉడతా వెంకట్రావ్ యాదవ్, శ్రీనివాసులురెడ్డి, మోహన్‌రెడ్డి, సంజయ్‌కుమార్, గణేష్ తదితరులు సంతాపం తెలిపారు.

ఉద్యమ గొంతుక మూగబోయింది

దేశ వ్యాప్తంగా ఎన్నో ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన సీతారాం ఏచూరి అమరుడవడం బాధించింది. ఉద్యమాల గొంతుక మూగబోయినట్లుంది. ప్రజాస్వామ్యం పట్ల బాధ్యత, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాట స్ఫూర్తి, పాలకులను నిలదీసేతత్వం ఆయన సొంతం. ఆయన మరణం సీపీఎంకే కాకుండా దేశ రాజకీయాలకు తీవ్ర నష్టం.

- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి

ఎన్నో సార్లు కలిసి పని చేశాం

సీపీఎం నుంచి ఏచూరి, సీపీఐ నుంచి నేను రాష్ట్ర ఉద్యమాలలో కలిసి పనిచేశాం. ఆయన నుంచి నేర్చుకోవాల్సిన ఆదర్శాలు చాలా ఉన్నాయి. నిబద్ధత కలిగిన నాయకుడు. ప్రజా సమస్యలపై పాలకులను నిరంతరం ప్రశ్నించే ఆయన ధోరణి తరతరాలకు నిలబడిపోతుంది. జాతీయ నాయకుడైనప్పటికీ నాతో చాలా బాగామాట్లాడే వారు. ఆయనంటే నాకు అపారమైన గౌరవం.

- పముజుల దశరథరామయ్య, సీపీఐ సీనియర్ నేత

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కిరణ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(వైద్యం) : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా జిల్లాలోని మనుబోలు మండలానికి చెందిన నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురువారం నియమిం చారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, పార్టీ అభ్యు న్నతికి కృషి చేస్తానని తెలిపారు. షర్మి లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



షర్మిలకు కృతజ్ఞతలు తెలుపుతూ మొక్కను అందజేస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

చిన్నారులకు వినికిడి యంత్రాల పంపిణీ



చిన్నారులకు వినికిడి యంత్రాలు అమరుస్తున్న డీఎంహెచ్‌వో పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 12 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని బాల భవిత కేంద్రంలో గురువారం వినికిడి యంత్రాల పంపిణీ జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య చిన్నారులకు ఈ యంత్రాలు అందచేశారు. ఆయన మాట్లాడుతూ 80 మందికి ఉచితంగా వినికిడి యంత్రాలు అమర్చాలని నిర్ణయించామని, గురువారం 40 యంత్రాలు, శుక్రవారం మరో 40 యంత్రాలు అమరుస్తున్నామని చెప్పారు. వినికిడి యంత్రాలు అవసరమైన వారు బాలభవిత కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, డైస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్‌కుమార్, ఆడియాలజిస్ట్ డాక్టర్ వినీల తదితరులు పాల్గొన్నారు.

చెన్నై గ్లెనిగల్స్ ఆసుపత్రిలో అరుదైన చికిత్స

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 12 : చెన్నై గెనిగల్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో ఊపిరితిత్తులకు అరుదైన చికిత్స నిర్వహించినట్లు ప్రముఖ డాక్టర్ గురుప్రసాద్ వెల్లడించారు. నెల్లూరులోని ఓ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఏఎస్ పేటకు చెందిన నారాయణమ్మ (32) ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండగా ఆమెకు హృద్రోగమూ వచ్చిందన్నారు. చెన్నై గ్లెనిగల్స్ ఆసుపత్రికి రావడంతో పల్మనరీ డినర్వేషన్ థెరపీ ద్వారా చికిత్స అందించామని చెప్పారు. దేశంలోనే మొదటి సారిగా నిర్వహించిన ఈ చికిత్స వల్ల సత్ఫలితాలు సాధించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్లెనిగల్స్ ఆసుపత్రి సీఈవో డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ సింధూర, మార్కెటింగ్ మేనేజర్ గీతాఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

155 మందికి కంటి వైద్య పరీక్షలు

రాపూరు, సెప్టెంబరు 12 : మండలంలోని గోనుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ ఆచార్య నాగేంద్ర కుమార్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కంటి వైద్యులు బి గురువయ్య పాల్గొని 155 మంది విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో నలుగురికి కంటి అద్దాలు అవసరమని గుర్తించి త్వరలోనే ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ ఆచార్య నాగేంద్రకుమార్, ఎంఎల్‌హెచ్‌పీబీ హెప్సిబా, ఆరోగ్య కార్యకర్తలు కృష్ణవేణి, ఆశాలు టి భాగ్యమ్మ, ఎన్ పార్వతి, పాఠశాల ఉపాధ్యాయులు కె పరంధామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్

సైదాపురం, సెప్టెంబరు 12: మండల పరిధిలోని ఆర్‌వైజీ పాళెం, మర్లపూడి గ్రామాల్లో ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ పరిశీలించారు. కూలీలు తక్కువ సంఖ్యలో హాజరుకావడంతో ఎంపీడీవో సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం మస్టర్లు పరిశీలించారు. వీరి వెంట ఏపీవో చంద్రయ్య ఉన్నారు.

కనుల పండువగా 16రోజుల పండుగ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 12 : నగరంలోని మహాత్మాగాంధీనగర్ కృష్ణ మందిరంలో గురువారం రాత్రి 16 రోజుల పండుగ కన్నుల పండువగా జరిగింది. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా కల్యాణం జరిగి 16రోజులు అయిన సందర్భంగా ఈ వేడుక నిర్వహించారు. అర్చకుడు బీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రుక్మిణీ, సత్యభామ సమేత కృష్ణస్వామికి విశేష అలంకారం, ప్రత్యేక పూజలు జరిగాయి. దంపతులకు ఫలతాంబూలాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త వెంకటేశ్వరరావు, కార్యదర్శి సుబ్బరామరాజు, ఉభయకర్తలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చెత్తతో నిండిపోయిన పున్నమి రెస్టారెంట్

నిరుపయోగంగా పున్నమి రెస్టారెంటు

వెంకటాచలం, సెప్టెంబరు 12 : పట్టించుకునే నాథుడు లేక పున్నమి రెస్టారెం టు నిరుపయోగంగా మారిందని, గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు రెస్టారెంట్‌లో పనికివచ్చే సామగ్రిని అపహరించుకెళ్లారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండలవాసి, పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు 2004లో కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో యాత్రాస్థలమైన కసుమూరులో రూ.20 లక్షలు మం జూరు చేయించి పున్నమి రెస్టారెంటును ఏర్పాటు చేయించారు. ఇందులో హోటల్‌తోపాటు శుభకార్యాలు చేసుకోవడానికి వీలుగా ఫంక్షన్ హాలు, అద్దె గదులను ఏర్పాటు చేశారు. అప్పట్లో కొంత కాలం ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చారు. అయితే కొంతకా లా నికి ఇది మూతపడి నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని పున్నమి రెస్టారెంటును వినియోగంలోకి తెస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతోపాటు యాత్రికులకు కూడా సౌకర్యంగా ఉంటుంది.

పొదుపు లీడర్లు, ఆర్పీల అక్రమాలు

● జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్



పొదుపు మహిళలతో మాట్లాడుతున్న గునుకుల కిషోర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 12: పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న నగదును చెల్లించినా గ్రూపు లీడర్లు, ఆర్పీలు పుస్తకాలలో ఎంట్రీ చేయకుండా, బ్యాంకుల నుంచి వచ్చిన సబ్సిడీలను అక్రమంగా వడ్డీలకు తిప్పుకుంటూ పొదుపు మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఆరోపించారు. నగరంలోని బృందావనం వద్ద ఉన్న పొదుపు కార్యాలయాన్ని జనసేన నాయకులు గురువారం సందర్శించారు. పొదుపు మహిళలతో మాట్లాడి వారి బాధలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ పొదుపు మహిళలు తీసుకున్న రుణం తాలూకు వాయిదా సక్రమంగా చెల్లిస్తున్నా గ్రూపు లీడర్లు, ఆర్పీలు కుమ్మక్కై అవకతవకలకు పాల్పడుతున్నారన్నారు. అటువంటి వారి వివరాలు మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

కాశీలో నెల్లూరు చిన్నారుల నృత్య ప్రదర్శన

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 12 : సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాశీ విశ్వనాథస్వామి సన్నిధిలో నెల్లూరు కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అంతర్జాతీయ కర్ణాటక సంగీత నాట్య కళాకారుల సంస్థ (ఐసీఎండీఏ) ఈనెల 1వతేదీన 10వ ప్రపంచ రికార్డ్స్ మెగా ఈవెంట్‌ను అక్కడ నిర్వహించింది. ఇందులో వెయ్యి మంది నృత్య కళాకారులు పాల్గొన్నారు. నగరానికి చెందిన శివనృత్య కళానిలయం నాట్య గురువు శ్రావణి సునీల్ శిష్య బృందం రావణకృత శివతాండవం నృత్య ప్రదర్శన చేసింది. ఈ బృందంలో మోక్షిత నాయుడు, భావన, వర్ధిని, జననీ, పూర్వచంద్రిక, నాగభావన, దీక్షితా చౌదరి, సరస్వతి, దీప్తి, పావని, వర్షిణీ, సుదీప్తి, హేమశ్రీ ఉన్నారు. ఈ సందర్భంగా ఐసీఎండీఏ సంస్థ మూడు ప్రశంసా పత్రాలు, పతకాలతో వారిని సత్కరించింది.



కోవూరులో ఆందోళన చేస్తున్న నర్సులు

కాంట్రాక్టు నర్సులను పర్మినెంట్ చేయాలి

కోవూరు, సెప్టెంబరు 12 : కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే స్టాఫ్ నర్సులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రభుత్వ వైద్యశాల నర్సులు గురువారం ఆందోళనకు దిగారు. వారి ఆందోళనకు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటచలపతి గౌడ్ మద్దతు పలికారు. ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో స్టాఫ్ నర్సులుగా పనిచేస్తున్న నర్సులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. స్టాఫ్ నర్సుల పోస్టులను వెంటనే భర్తీ చేయాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఆందోళనలో కోవూరు, ఇనమడుగు ప్రభుత్వ వైద్యశాలల్లోని స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

శబరిమలలో అన్నదానానికి సహకారం



శబరిమలకు వాహనాన్ని పంపిస్తున్న ఈదూరు

ముత్తుకూరు, సెప్టెంబరు 12 : శబరిమల సన్నిధానంలో కార్తీకమాస దీక్షలో ఉన్న అయ్యప్పభక్తులకు అన్నదానం చేస్తుంటారు.ఈ కార్యక్రమానికి తమవంతుగా నెల్లూరు-తిరుపతి జిల్లాల పరిధిలోని శబరిమల అయ్యప్ప సేవాసమాజం వారు సరుకులు పంపారు. గురువారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించి, గొలగమూడి ఆశ్రమ కమిటీ సభ్యుడు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి జెండా ఊపి వాహనాన్ని శబరిమలకు పంపించారు. దాతల సహకారంతో సమకూర్చిన రూ.1.50లక్షల విలువయిన బియ్యం, పప్పుదినుసులు, కూరగాయలు, నూనె, ఇతర సామగ్రిని వాహనంలో పంపారు. కార్యక్రమంలో శబరిమల అయ్యప్ప సేవా సమాజం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేకల వెంకయ్య, జిల్లా అధ్యక్షుడు రాజ, ప్రధానకార్యదర్శి పేట విజయశేఖర్, సభ్యులు ముత్యాలయ్య, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి సీతారాం మృతికి సంతాపం

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం ఆకస్మిక మృతిపై బుచ్చి పట్టణంతోపాటు మండలంలోని సీపీఎం నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు. పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన మృతి పార్టీకి తీరనిలోటని వారు తెలిపారు. ఏచూరి సేవలు గుర్తు చేసుకుని ఆయనకు విప్లవ జోహార్లు తెలియజేశారు.

సీఎం చిత్రపటాల పంపిణీ



అధికారులకు చిత్రపటాలు అందిస్తున్న నాయకులు

పొదలకూరు, సెప్టెంబరు 12: మండలంలోని ప్రభగిరిపట్నం గ్రామ సచివాలయానికి గురువారం తెలుగు యువత నాయకులు పీ అంజి, కండే సునీల్‌ల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చిత్రపటాలను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తున్నదని, ఇందుకు నిదర్శనం విజయవాడ వరదలను సమర్థవంతంగా ఎదుర్కోవడ మేనన్నారు. ఆంధ్రుల కలఅయిన అమరావతి అభివృద్ధి, పోలవరాన్ని ఈ ప్రభుత్వంలోనే పూర్తి చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కండే రవికుమార్, పట్నం పెంచలయ్య, గంగనబోయిన వెంకటేశ్వర్లు, గోగుల దయాకర్, ఓ.పెంచలయ్య సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యపై అలిగి భర్త అదృశ్యం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 12: భార్యపై అలిగి ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని ఫత్తేఖాన్‌పేటకు చెందిన మనోహర్‌లాల్ ఓ ప్రముఖ షాపింగ్‌మాల్‌లో మేనేజర్‌గా పనిచేస్తు న్నారు. అతని క్రెడిట్ కార్డును భార్య పూర్ణిమకు ఇవ్వడంతో ఆమె ఉపయోగించుకుంటోంది. ఆ కార్డు వాడకం విషయంలో దంపతుల మధ్య వివాదం నెలకొంది. దీంతో మనస్థాపానికి గురైన మనోహర్ ఈ నెల 11వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఆయన జాడ తెలియకపోవడంతో భార్య పూర్ణిమ గురువారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

318 మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 12 : టౌనుహాలులో గురువారం 318 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఇంటర్నేషనల్ హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ జీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు హాజరయ్యారు. ఇంటర్నేషనల్ హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ వారు ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, యూనివర్సిటీలకు ఏటా రూ.25లక్షలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై జ్యోతివినాయక స్వామి

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 12 : నగరంలోని పురమందిరం జ్యోతి వినాయక స్వామి మందిరంలో చవితి బ్రహ్మోత్సవాలు గురువారం 7వ రోజుకి చేరాయి. ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. అనంతరం మూలవిరాట్‌కి చందనాలం కారం చేశారు. సాయంత్రం పూలంగి సేవ, విశేష పూజలు, అశ్వవాహనంపై నగరోత్సవం వైభవంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● చంద్రమౌళీనగర్ వేద గణపతి ఆలయం సెంటర్‌లో జరుగుతున్న గణేష్ చవితి ఉత్సవాల్లో గురువారం సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ ట్రస్ట్ పర్యవేక్షించింది.

విఘ్నేశ్వరాలయంలో కుంభాభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 12 : నగరంలోని గాంధీబొమ్మ కూడలి శివాజీ సెంటర్‌లో గల వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం 25వ వార్షిక కుంభాభిషేకం జరిగింది. గణేష్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు, హోమాలు, పూలంగిసేవ జరిగాయి. ఆలయ గోపుర శిఖర కలిశాలకు సంప్రోక్షణ చేశారు. భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. పీ సురేంద్రరెడ్డి, కేవీ సుబ్రహ్మణ్యం, పేటేటి భాస్కర్‌రావు, మిడతల రమేష్, బీఎస్ రంగరాజన్, అర్చకుడు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరి రామిరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 12 : జిల్లాలోని యల్లాయపాళెంలో తొలితరం తెలుగు కవి, సాహితీవేత్త కవికోకిల దువ్వూరు రామిరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయించాలని కథకులు జగన్ మిత్ర, పల్లేటి బాలాజీ రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, పొంగూరు నారాయణకు విజ్ఞప్తి చేశారు. నెల్లూరు నగరంలోని ఏదైనా ఒక పార్కుకుగానీ, వీధికిగానీ రామిరెడ్డి పేరు పెట్టాలని కోరారు.



మరోసారి రక్తమోడిన భాకరాపేట ఘాట్

తిరుమల నుంచి తిరిగివెళ్తూ ప్రాణాలు కోల్పోయిన చిక్‌బళ్లాపురవాసులు



మృతులు మునివెంకటరెడ్డి, మంజునాథ, రమేష్‌మూర్తి (ఫైల్‌ఫొటోలు)



గాయపడ్డ అల్లావుద్దీన్

చంద్రగిరి, సెప్టెంబరు 12: తిరుపతి-మదనపల్లె రహదారిలోని భాకరాపేట ఘాట్ మరోసారి రక్తమోడింది. తరచూ ప్రమాదాలతో వార్తల్లో వుండే ఈ రోడ్డులో గురువారం జరిగిన అనూహ్య సంఘటనతో కర్ణాటకవాసులు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.పోలీసుల కథనం మేరకు... కర్ణాటక రాష్ట్రం, చిక్‌బళ్లాపుర సమీపంలోని హరిస్థలకు చెందిన తేజస్ కుమార్(35) తన తండ్రి మునివెంకటరెడ్డి(55), బావమరిది మంజునాథ(38)తో కలిసి కారులో తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్ళి గురువారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. గోలచిండెనహళ్ళికి చెందిన రమేష్‌మూర్తి(34) కారు నడుపుతున్నాడు. 2గంటల సమయంలో భాకరాపేట ఘాట్ రోడ్డులో వెళ్తుండగా కలకడ నుంచి చెన్నైకి టమోటాలను తీసుకెళ్తున్న కంటైనర్ మలుపు వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న వీరి కారుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయిపోయింది. సమాచారం అందుకున్న చంద్రగిరి, భాకరాపేట సీఐలు సుబ్బరామిరెడ్డి, ఇమ్రాన్‌బాషా, కళ్యాణి డ్యామ్ వద్ద వున్న పోలీసు శిక్షణ కళాశాల ఎస్‌ఐలు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు.పొక్లయినర్‌తో కంటైనర్ కింద వున్న కారును బయటకు తీసేందుకు సాధ్యం కాకపోవడంతో తిరుపతి నుంచి ఒక క్రేన్, భాకరాపేట నుంచి మరో క్రేన్ రప్పించారు.ఈలోపు పోలీసులతో పాటు ఆ దారిలో వెళుతున్న వాహనదారులు కంటైనర్‌లో ఉన్న టమోటా బాక్సులను బయటకు తీశారు. మూడు గంటల సమయంలో క్రేన్ సాయంతో కంటైనర్‌ను అతి కష్టంపై పైకి తీసి, కారులోంచి కేకలు వేస్తున్న తేజస్ కుమార్‌ను బయటకు తీశారు.చికిత్స నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.కారులోనే ఇరుక్కుపోయి మృతి చెందిన రమేష్ మూర్తి, మంజునాథ, మునివెంకటరెడ్డి మృత దేహాలను బయటకు తీశారు.ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ నర్సింగప్ప సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. మృతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించే ఏర్పాట్లు చేశారు.తరచూ ఇదే ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్న ఎస్పీ జాతీయ రహదారి అధికారుల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలను చేపడతామని తెలిపారు. కాగా కంటైనర్ డ్రైవర్ అల్లాహుద్దీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఐదు కిలో మీటర్ల దూరం స్తంభించిన ట్రాఫిక్

భాకరాపేట ఘాట్‌లో ఈ ప్రమాదంతో సుమారు ఐదు కిలో మీటర్ల దూరం వాహన రాకపోకలు స్తంభించి పోయాయి.కంటైనర్ కింద కారులోని మృత దేహాలను బయటకు తీయడానికి సాయంత్రం 4గంటలైంది.తరువాత కంటైనర్‌ను పక్కకు తీసి, వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు.ఆ లోపు తిరుపతి నుంచి మదనపల్లె, పీలేరుకు వెళ్ళే వాహనాలను చంద్రగిరి మండలంలోని ఎ.రంగంపేట నుంచి నారావారిపల్లె, కొత్తపేట మీదుగా భాకరాపేటకు పంపించారు.మరికొన్ని వాహనాలను ఎ.రంగంపేట నుంచి ఐతేపల్లె,దామలచెరువు మీదుగా పీలేరుకు పంపించారు.

జగన్‌తో పలువురు నేతల భేటీ

తిరుపతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌ను గురువారం చిత్తూరు,తిరుపతి జిల్లాలకు చెందిన పార్టీ నేతలు పలువురు కలిశారు. మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కళత్తూరు నారాయణస్వామి, ఆర్కే రోజా, ఎంపీ మిధున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బియ్యపు మధుసూదనరెడ్డి, వెంకటే గౌడ, డాక్టర్ సునీల్, ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసిన మోహిత్‌రెడ్డి, అభినయ్, నిషార్ అహ్మద్, రాజేష్, కృపాలక్ష్మి, విజయానందరెడ్డి,నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి,సంజీవయ్య, మేరిగ మురళీధర్ తదితరులు గురువారం తాడేపల్లిలోని వైసీపీ ప్రధాన కార్యాలయంలో జగన్‌తో భేటీ అయ్యారు. నిజానికి ఎన్నికల ఫలితాలతో షాక్‌కు గురైన వైసీపీ నేతలు నైరాశ్యంలో కూరుకుపోయారు.చాలామంది ఇరుగుపొరుగు రాష్ట్రాలకు వెళ్ళిపోయి వ్యాపార పనుల్లో నిమగ్నమయ్యారు. మరికొందరు స్థానికంగానే వున్నా రాజకీయంగా క్రియాశీలం కాకుండా నిరాసక్తంగా వుంటున్నారు. దీనికి తోడు అధినేత కూడా రాష్ట్రంలో కాకుండా బెంగళూరులో ఎక్కువగా వుంటుండడంతో గత మూడు నెలల కాలంలో పెద్దగా వీరు కలిసింది లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల అరెస్టయి జైలులో వున్న బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పరామర్శించేందుకు జగన్ రాష్ట్రానికి రావడంతో వీరంతా తాడేపల్లి చేరుకుని జగన్‌ను కలిశారు. కొందరు బుధవారమే వెళ్ళగా మరికొందరు గురువారం వెళ్ళి అందరూ కలసి బృందంగా వెళ్ళి అధినేతతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కొంతసేపు ఉమ్మడి జిల్లాలో నెలకొన్న పరిస్థితులను జగన్ ఆరా తీసినట్టు తెలిసింది. నియోజకవర్గాల వారీగా పరిస్థితిని ఆయా నేతలను ప్రశ్నించి తెలుసుకున్నట్టు సమాచారం.



దేవర సినిమా చూసి చచ్చిపోతా

అమ్మా.. అప్పటిదాకా బతికించండి

తిరుపతిలో బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న యువకుడి వేడుకోలు



ఆసుపత్రిలో కౌశిక్

- బతికించండంటూ తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు

తిరుపతి(విద్య), సెప్టెంబర్ 12 : "నా బిడ్డకి బ్లడ్ కేన్సర్. జూనియర్ ఎన్టీయార్‌కి వీరాభిమాని. రోజు రోజుకీ పరిస్థితి విషమిస్తోంది. 'అమ్మా దేవర సినిమా చూసి చచ్చిపోతా.. 27వ తేదీ దాకా నన్ను బతికించండి..' అని వేడుకుంటున్నాడు" అంటూ 19 ఏళ్ల కౌశిక్ తల్లి సరస్వతి కన్నీరు మున్నీరవుతూ వెల్లడించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం తమ బిడ్డ పరిస్థితి గురించి మీడియాకు వివరిస్తూ సాయం చేయండంటూ ఆమె వేడుకున్నారు. టీటీడీలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు, సరస్వతి దంపతుల పెద్ద కుమారుడు కౌశిక్ ఇంటర్ చదువుతుండగా అనారోగ్యానికి గురయ్యాడు. బ్లడ్ కేన్సర్ అని నిర్ధారణ కావడంతో 2022 నుంచీ చికిత్స తీసుకుంటున్నాడు.బోన్‌మారో చేయాలని వైద్యులు చెప్పారు. హైదరాబాద్‌లోని బసవతారకం కాన్సర్ ఆసుపత్రి సహా చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు తిరిగారు. ప్రస్తుతం బెంగళూరులోని కిడ్వై హాస్పిటల్లో కౌశిక్ చికిత్స పొందుతున్నాడు. బోన్‌మారో చికిత్సకు దాదాపు రూ.60 లక్షలకు పైగానే ఖర్చవుతుందని తెలియడంతో తల్లిదండ్రులు హతాశులయ్యారు. రోజు రోజుకూ మరణానికి దగ్గరవుతున్న కొడుకును చూస్తూ వారు దుఃఖిస్తున్నారు. దాతలు ముందుకు వస్తే బిడ్డ బతుకుతాడని ఆశపడుతున్నారు. వారి వేదన చూసి 'అమ్మా నేను బతకనని నాకు తెలుసు.. నా కోసం బాధపడకండి.. దేవర సినిమా దాకా బతికించండి చాలు.. నా చివరి కోరిక తీర్చండి' అంటూ తమను బిడ్డ సముదాయిస్తున్నాడని చెబుతూ, కౌశిక్‌కి ప్రాణదానం చేయండంటూ ఆ తల్లిదండ్రులు చేతులు జోడిస్తున్నారు. 9490829381 నెంబరుకు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా గానీ లేదా కె. సరస్వతి, యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 103310100044506, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0801313కు గాని దాతలు తమ సాయాన్ని అందించవచ్చు.సమాచారం కోసం 79956 65169 నెంబరులో కౌశిక్ తల్లిదండ్రులను సంప్రదించవచ్చు.



కలెక్టర్‌కు చెక్ అందజేస్తున్న మెప్మా పీడీ రాధమ్మ తదితరులు

వరద బాధితుల సహాయార్థం విరాళాల వెల్లువ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 12: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి గురువారం కూడా జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది విరాళాలను కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు. ● జిల్లా మెప్మా పీడీ రాధమ్మ తమ శాఖ తరఫున ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.4,34,500 చెక్‌ను తమ శాఖాధికారులతో కలిసి అందజేశారు. ● జిల్లా నీటిపారుదల శాఖ విజయ్‌కుమార్ తన వంతుగా రూ.44 వేల చెక్కును అందజేశారు. ● ఎస్పీ కార్యాలయ సిబ్బంది రూ.20 వేల చెక్కును అందజేశారు. ● జిల్లా ఖజానా శాఖ అధికారి రవికుమార్ తన వంతుగా రూ.10 వేల చెక్‌ను అందజేశారు.

కార్పెంటర్ల సాయం రూ.1.15లక్షలు

చంద్రగిరి, సెప్టెంబరు 12: వరద బాధితులను ఆదుకోవడానికి రాష్ట్రంలోని కార్పెంటర్లందరూ కలిసి తమ యూనియన్ ద్వారా గురువారం రూ.1.15 లక్షల చెక్‌ను సీఎం చంద్రబాబుకు విజయవాడలో అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులతోపాటు జిల్లాకు చెందిన నాయకులు సురేంద్రబాబు, మోహనాచారి తదితరులున్నారు.



సీఎం చంద్రబాబుకు చెక్ అందజేస్తున్న కార్పెంటర్లు

వృషభుడిపై మూషిక వాహనుడు



వృషభ వాహనంపై ఉత్సవర్ల ఊరేగింపు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 12: కాణిపాక వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం చిలుక.. రాత్రి వృషభ వాహనాలపై ఉత్సవర్లు ఊరేగారు. చిలుక వాహన సేవకు కాణిపాకానికి చెందిన ఆర్యవైశ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వృషభ వాహన సేవకు కాణిపాకం, సంతపల్లె, మారేడుపల్లె, ముదిగోళం, చిత్తూరుకు చెందిన శాలివాహన వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకురావడంతో ఆలయ కల్యాణ వేదికపై సిద్ధి, బుద్ధి సమేత స్వామివారి ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. వృషభ వాహనంపై ఆశీనులను చేసి కాణిపాక పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈవో గురుప్రసాద్. ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి, ఉభయదారులు పాల్గొన్నారు.

ఘనంగా రథ కలశ పూజ

బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించనున్న రథోత్సవానికి గురువారం రథ కలశ పూజ నిర్వహించారు.ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, రథ కలశ అభిషేకం, రథ సారథి పూజ, సంప్రోక్షణ జరిగింది. స్వామివారి గొడుగులను అమర్చి రథ కలశాన్ని గ్రామంలో ఊరేగించారు. రథ శిఖరంపై కలశాన్ని ప్రతిష్ఠించారు. రథోత్సవానికి రథాన్ని సిద్ధం చేశారు.



చిలుక వాహనంపై ఊరేగుతున్న వరసిద్ధుడు


తిరుపతిలో 18 నెలల బాలుడి అదృశ్యం




తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 12: తిరుపతిలో 18 నెలల బాలుడు అదృశ్యమయ్యాడు. ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నేపాల్‌కు చెందిన కైలాస్, మౌనీషా దంపతులు 20 ఏళ్ల కిందట తిరుపతికి వలస వచ్చారు. శ్రీనివాసపురంలోని గోకుల నిలయంలో కైలాస్ వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. వీరికి 18 నెలల బాలుడు బాలాజీ ఉన్నాడు. భార్య, బిడ్డతో కలిసి బుధవారం రాత్రి బజారులో నిత్యావసరాలు కొనుగోలు చేసి, ఇంటికెళ్లడానికి ఆటో ఎక్కాడు. అప్పటికే ఫూటుగా మద్యం తాగి ఉన్న కైలాస్.. టౌన్‌బ్యాంకు ఎదురుగా ఉన్న వినాయకస్వామి ఆలయం వద్దకొచ్చేసరికి ఆటోని ఆపి దిగేశాడు. భర్త దిగిపోవడంతో కంగారుగా బిడ్డను చూసుకోకుండా భార్య కూడా ఆటో దిగేసింది. కొంతసేపటికి బిడ్డ కనిపించలేదని దంపతులు గుర్తించి చుట్టుపక్కల వెతికాడు. ఫలితం లేకపోవడంతో గురువారం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాలతో రెండు ప్రత్యేక టీమ్‌ల ద్వారా డీఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో సీఐ మహేశ్వరరెడ్డి గాలింపు చర్యలు చేపట్టారు.

ఆర్డీవోను కలిసిన బీజేపీ నాయకులు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 12: ఇటీవల సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాఘవేంద్రమీనాను గురువారం బీజేపీ నాయకులు కలిసి పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, పురుషోత్తం రెడ్డి, కోటేశ్వర రావు, నరేంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.













కొనసాగుతున్న కార్మికుల ధర్నా




పరిశ్రమ ఎదుట నిరసన తెలియజేస్తున్న కార్మికులు, సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నాయుడుపేట, సెప్టెంబరు 12: నాయుడుపేట మేనకూరు సెజ్‌లోని రాయల్ టెక్స్‌టైల్స్ కార్మికులు గురువారం కూడా ధర్నా చేశారు. కార్మికులకు తెలియ జేయకుండా పరిశ్రమను లాక్‌అవుట్ చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తపరిచారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివకవి ముకుంద మాట్లాడుతూ పరిశ్రమ లాక్ అవుట్ చేస్తే కార్మికులకు పూర్తి బెనిఫిట్స్ అందజేయాలన్నారు. పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ యాజమాన్యంతో మాట్లాడి ఈనెల 18వ తేదీ నిర్ణయం తీసుకుంటామన్నారు. ఐఎన్‌టీయూసీ నాయకులు ఎగుదల విజయ కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, పద్మమ్మ తదితరులు ఉన్నారు.

గూడూరు : నాయుడుపేట మండలంలోని మేనకూరు సెజ్‌లో గల రాయల్ టెక్స్‌టైల్స్ కర్మాగార కార్మికులను ఆదుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనాకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనకూరు సెజ్‌లో గల రాయల్ టెక్స్‌టైల్స్ కర్మాగారాన్ని కొద్దిరోజుల క్రితం మూసివేశారన్నారు. ఈ పరిశ్రమపై ఆధారపడి సుమారు 600 మంది కార్మికులు జీవిస్తున్నారన్నారు. పరిశ్రమను మూసివేయడంతో కార్మికులు జీవనోపాధిని కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరిని ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శివకుమార్, సురేష్, చంద్రయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

స్థానికుల భాగస్వామ్యంతోనే పోలేరమ్మ జాతర

● ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి,సెప్టెంబరు12:వెంకటగిరి పోలేరమ్మ జాతరను ప్రజల భాగస్వామ్యంతో వైభవంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామ కృష్ణ తెలిపారు. గురువారం జాతర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పుర ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా పార్టీ కార్యాలయంలో భక్తుల లోసం కాల్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అమ్మవారి పుట్టినిల్లు అయిన కుమ్మరింట, జీనిగలవారి వీధిలోని అత్తవారిల్లుగా భావించే చాకలింట, కాంపాళ్ళెంవద్ద ఉన్న గాలిగంగలు, అమ్మవారిని విరూపం చేసే విరూప మండపం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

జాతర విజయవంతం చేయాలి

పోలేరమ్మ జాతర విజయవంతం చేసేందుకు పుర ప్రజల సహకారంతోపాటు అధికారుల కృషి అవసరమని సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనన్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన జాతర నిర్వహణపై అధికారులతో సమావేశం జరిగింది. సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐ నాయక్, ఎండోమెంట్ ఏవో శ్రీనివాసుల రెడ్డి, అన్ని శాఖల అధికా రులు, టీడీపీనాయకులు, ప్రజలు హాజరయ్యారు.

వెంకటగిరిటౌన్ : సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ గురువారం కుమ్మరిఇళ్లు, మెట్టినిళ్లు సాకలి ఇళ్లు, అమ్మవారి నిలుపు స్థలం, నిమ్మజన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతర పర్యవేక్షణ కోసం ఈ నెల 17న కలెక్టర్ వెంకటేశ్వర్ వస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు డీఎస్పీ ఏవీ రమణ కుమార్, సీఐ ఏవీ రమణ, ఈవో శ్రీనివాసులు రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఫెన్సింగ్ రాళ్ల ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు



ఫెన్సింగ్ రాళ్లను ధ్వంసం చేస్తున్న దృశ్యం

చిల్లకూరు, సెప్టెంబరు 12: తన స్థలానికి సంబంధించిన ఫెన్సింగ్ రాళ్లను కొందరు ధ్వంసం చేసి తనపై దాడికి పాల్పడ్డారని గురువారం మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన కట్టా రామిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి రామిరెడ్డి వివరాల మేరకు... ముత్యాలపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 340లో తనకు 400 చదరపు గజాల స్థలం ఉందన్నారు. తన స్థలానికి రక్షణగా ఫెన్సింగ్ రాళ్లను, వైర్లను నాటి ఉన్నామన్నారు. అయితే ఇదే గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి రౌడీ మూకలను తీసుకువచ్చి తన ఫెన్సింగ్ రాళ్లను, తీగలను ధ్వంసం చేశారన్నారు. తనపై దాడికి పాల్పడ్డారన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

తొణుకుమాల పొలాల్లో మృతదేహం వెలికితీత



వెంకటేశ్వర్లు మృతదేహం

చిల్లకూరు,సెప్టెంబరు12:తొణుకుమాల సమీపంలో ఈనెల 10వ తేదీన ఓ వ్యక్తిని హత్యచేసి మృతదేహాన్ని పూడ్చిపెట్టా రనే సమాచారం కలకలం రేపింది. దీంతో గురువారం వైద్య, పోలీసు, రెవెన్యూ అధికారుల సమక్షంలో గుంటను తవ్వి మృతదేహాన్ని వెలికి తీశారు. గూడూరు తహసీల్దారు చంద్రశేఖర్, సీఐ కిషోర్ బాబు, ఎస్‌ఐ సురేష్‌బాబు సమక్షంలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. తొణుమాల సమీపంలోని ఓ తోటలో అంకయ్య, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు కుటుంబసభ్యులతో కలిసి కాపలాగా ఉంటున్నారు. వెంకటేశ్వర్లు, అంకయ్యలు సమీప పొలాల్లో స్టార్టర్లు, మోటార్లు అపహరించి అందులోని కాపర్‌ను విక్రయిస్తుంటారు. వచ్చిన డబ్బులను పంచుకుంటుంటారు. ఈ క్రమంలో డబ్బుల పంపిణీ విషయమై వివాదం జరగడంతో అంకయ్య వెంకటేశ్వర్లు (32)ను హత్యచేసి పూడ్చివేసినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. 10వ తేదీ ఉదయం ఉంచి అంకయ్య, వెంకటేశ్వర్లు, ఈయన భార్య తోటలో కనిపించక పోవడంతో తోట యజమానురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు అనుమానాస్పదంగా ఉన్న చోట గుంటను తవ్వడంతో వెంకటేశ్వర్లు మృతదేహం లభ్యమైంది. పరారీలో ఉన్న అంకయ్య, వెంకటేశ్వర్లు భార్య కోసం పోలీసులు గాలిస్తున్నారు. హత్యానేరం కింద కేసునమోదు చేసుకుని విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ మేనేజర్‌కు సన్మానం



నాయుడుపేట, సెప్టెంబరు12: మున్సిపల్ మేనేజర్ ఖాజామొహి ద్దీన్ శ్రీకాళహస్తికి బదిలీ అయ్యారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ మేనేజర్ ఖాజామొహిద్దీన్‌ను వార్డు సచివా లయ వెల్ఫేర్ సిబ్బంది శాలువా, పూలమాలలతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది శ్రీనివాసులు, ఉదయ్, సుకుమార్, కిషోర్, రవిచంద్ర, చెంగయ్య, విజయభాస్కర్, జనార్ధన్, సుబ్బులయ్య తదితరులు ఉన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన టపాసుల పట్టివేత

పెళ్లకూరు, సెప్టెంబర్12: అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని పెన్నేపల్లి పీఎంకే పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న కేఆర్ కాంప్లెక్స్‌లోని ఒక గదిలో అక్రమంగా టపాసులను నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఎస్‌ఐ శ్రీకాంత్, స్థానిక వీఆర్వో సుమతితో కలసి బాణాసంచా నిల్వ ఉంచిన గది వద్దకు చేరుకుని పరిశీలించి రూ.65 వేల విలువ చేసే టపాసులను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులు గిరికుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

441కి చేరిన నేత్రదానం



శేగు వీరమ్మ(ఫైల్)

సూళ్లూరుపేట, సెప్టెంబరు 12: సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పట్టణంలోని చాకలి వీధికి చెందిన శేగు వీరమ్మ (85)మరణాంతరం ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను .చెన్నై శంకర నేత్రాలయకు దానం చేశారు. దీంతో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ నిర్వహిస్తున్న నేత్రదానం 441కి చేరింది. సంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఎం.శ్రీనివాసులు, ఏ.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

చెరువు మట్టి తరలింపునకు యత్నం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 12: ఇలుపూరు చెరువు నుంచి మట్టిని తరలించేందుకు కొందరు అక్రమార్కులు ప్రయత్నాలు చేశారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అక్కడకు చేరుకోవడంతో వారు వాహనాలు వదిలేసి వెళ్లిపోయారు. అధికార, ప్రతిపక్ష నాయకులు కుమ్మక్కై చెరువు కట్టను తవ్వి దారిచేసుకొని చెరువు వీఆర్వో శ్రీదేవి, ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బ్రహ్మానాయుడు తెలిపారు.

20, 21 తేదీలలో స్కూల్ గేమ్స్

కోట, సెప్టెంబరు 12 : కోటలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 20, 21వ తేదీలలో మండలస్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించాలని ఎంపీడీవో భవానీ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్కూల్ గేమ్స్‌పై వ్యాయామ ఉపాధ్యాయులతో ఎంపీడీవో భవానీ, ఎంఈవో మస్తానయ్య సమీక్ష నిర్వహించారు.

బలిజ మహిళల సంక్షేమానికి కృషి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 12: బలిజ మహిళలు, విద్యార్థినుల సంక్షేమానికి బలిజ మహిళా సంక్షేమ సంఘం కృషి చేస్తుందని ఆ సంఘ గౌరవాధ్యక్షురాలు సారంగం సులక్ష్మి అన్నారు. గురువారం త్యాగరాజవీధిలోని ఓ ఫంక్షన్ హాలులో ఆ సంఘ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతిభ కలిగిన పేద విద్యార్థినులను చదువులో ప్రోత్సహించేందుకు ఆర్థికసాయం అందజేయడం, మహిళల సమస్యలను పరిష్కరించేందుకు ఈ సంఘం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పద్మావతి, సువర్ణలక్ష్మి, శ్రావణలక్ష్మి, అరుణ, రాధ, జానకమ్మ, రాధిక, ఉషా, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

చిట్టమూరు, సెప్టెంబర్ 12 : మండల పరిధిలోని మల్లాంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి 24వ తేదీ వరకు జరుగనున్నాయి. 13న అంకురార్పణ, 14న ధ్వజారోహణ, 17న ఫలాభిషేకం, నంది సేవ, 18న రథోత్సవం, 19న షణ్ముకస్వామి కల్యాణం, 20న కల్యాణ రాయభారం, 21న కల్యాణం, 22న వసంతోత్సవం, ధ్వజారోహణ, 23 అలకలదోషు, 24న ఊంజల్ సేవ, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెళ్లకూరు, సెప్టెంబర్ 12 : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయి లక్ష్మి పేర్కొన్నారు. చిల్లకూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మల్లెమ్మ, ధనమ్మ పాల్గొన్నారు.

చీరలు, టవళ్లు పంపిణీ



గూడూరు, సెప్టెంబరు 12: విజయవాడలోని వరద బాధితుల సహాయక చర్యల్లో భాగంగా గూడూరు నియోజకవర్గ టీడీపీ ఆధ్వర్యంలో 5వేల కుటుంబాలకు చీరలు, టవల్స్, మస్కిటోకాయిల్స్‌ను అందజేసినట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం విజయవాడ లోని 43వ డివిజన్‌లో వరదబాధితులకు సహాయక చర్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజుల నుంచి స్థానిక నేతలతో కలిసి పర్యటిస్తూ బాధితులకు సామగ్రిని అందజేస్తున్నామన్నారు. గూడూరు నియోజక వర్గ టీడీపీ నాయకుల సహకారంతో రూ.7లక్షలతో ఈ సహాయక చర్యలను కొనసాగించామన్నారు. కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, సర్వోత్తమరెడ్డి, సతీష్‌రెడ్డి, నటశేఖర్, హరీష్ నాయుడు, చిరంజీవి, కీరవాణి పాల్గొన్నారు.

విద్యార్థుల విరాళాల సేకరణ



గూడూరు, సెప్టెంబరు 12: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం గురువారం పట్టణంలో స్వర్ణాంధ్ర భారతి విద్యార్థులు గురువారం పలు ప్రాంతాలలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నవకోటి నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో ఈ విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సేకరించిన విరాళాలను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సునీల్ రాజ్, హరికృష్ణ, సింధూ తదితరులు పాల్గొన్నారు

గణనాథుడి ఊరేగింపు



కోట, సెప్టెంబరు 12: మండల పరిధిలోని శ్యామ సుందర పురం, కోట తదితర గ్రామాల్లో గురువారం వినా యక చవితి గ్రామోత్సవాలు జరిగాయి. వినా యకుడి విగ్రహా లతో గ్రామోత్సవాలు నిర్వహించారు. అనంతరం గణేష్ విగ్రహాలను కోట మండలం శ్రీనివాససత్రం, వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరంలో నిమజ్జనం చేసేందుకు తరలించారు.

జగన్‌ను కలిసిన వైసీపీ నేతలు



వెంకటగిరిటౌన్,సెప్టెంబరు12: మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను వైసీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, ఆ పార్టీ నేతలు భూమన అభినయ్, మోహిత్ రెడ్డిలు గురువారం భేటీ అయ్యారు. నియోజకవర్గాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారని తెలిపారు. జిల్లాలో వైసీపీ బలోపేతం అయ్యేందుకు కృషి చేయాలని కోరారు.